
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
కడప
జిల్లా వార్తలు
5
శనివారం 14 సెప్టెంబరు 2024



గండికోట ప్రాజెక్టు నుండి మైలవరానికి నీరు విడుదలవుతున్న దృశ్యం

నిండుకుండలా..



- కళకళలాడుతున్న గండికోట జలాశయం
- కృష్ణాజలాలతో నింపడం ఇదే మొదటిసారి
- సెప్టెంబరులోనే నిండటం మరో రికార్డు

కృష్ణాజలాలతో నిండుకుండలా గండికోట జలాశయం

జిల్లాలో అడదడపా కురుస్తున్న వర్షాలు తప్ప ప్రాజెక్టుల్లోకి నీరు వచ్చే వానల్లేవు. అయినా గండికోట ప్రాజెక్టు నీటితో నిండుకుండలా మారింది. ఎగువన కురుస్తున్న వర్షాలతో పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నుంచి నీటిని కాలువ ద్వారా తీసుకొచ్చి దీనిని నింపారు. దీంతో సెప్టెంబరులోనే కృష్ణాజలాలతో గండికోట ప్రాజెక్టు కళకళలాడుతూ రైతుల్లో హర్షం నింపుతోంది.

కొండాపురం, సెప్టెంబరు 13: జిల్లాకు గుండెకాయ వంటి గండికోట జలాశయం గరిష్టస్థాయి నీటిమట్టంతో నిండుకుండలా ఉంది. గతంలో ఎన్నడూ లేని విధంగా సెప్టెంబరులోనే ఈ ఏడాది పూర్తిస్థాయిలో గండికోటకు కృష్ణాజలాలు చేరుకున్నాయి. ఆగస్టు 10న గండికోట ప్రాజెక్టుకు అవుకు రిజర్వాయిర్ నుంచి కృష్ణాజలాలను విడుదల చేశారు. పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ నుంచి 230కి.మీ ప్రయాణించి గండికోట ప్రాజెక్టుకు పూర్తి స్థాయిలో కృష్ణాజలాలను తీసుకుని రావడం ఇదే మొదటిసారి అని జలవనరుల శాఖ సీఈ మల్లికార్జునరెడ్డి తెలిపారు. 2020 డిసెంబరులో పూర్తిస్థాయిలో ప్రాజెక్టు నిండింది. అప్పుడు స్థానికంగా ఉన్న పెన్నా, చిత్రావతి నదులకు వచ్చిన వరద నీటితో ప్రాజెక్టు నిండిందని సీఈ తెలిపారు. కేవలం కృష్ణాజలాలతో 230 కి.మీ కాలువ ద్వారా తీసుకొచ్చి నీటిని నింపడం ఇదే తొలిసారి అని ఆయన తెలిపారు. ఇప్పటివరకు గండికోటకు 34 టీఎంసీల కృష్ణాజలాలు వచ్చాయన్నారు. ఇందులో నుంచి మైలవరం, సీబీఆర్, పైడిపాలెం, వామికొండ, సర్వరాయసాగర్‌లకు నీటిని విడుదల చేశామన్నారు. గండికోట ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటినిల్వ 26.85 టీఎంసీలు కాగా శనివారం ఉదయానికి గండికోట ప్రాజెక్టులో 25.5 టీఎంసీల నీరు ఉందన్నారు. పూర్తిస్థాయిలో గండికోట ప్రాజెక్టు దాని అనుబంధ జలాశయాలు నీటితో కళకళలాడుతుండటంతో రైతన్నలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పులివెందులకు మొదటిసారి నీళ్లిచ్చిన ఘనత చంద్రబాబుదే

గండికోట ప్రాజెక్టుకు మొదటిసారి 2013లో కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రభుత్వం 3 టీఎంసీలు నీరు నిల్వ చేయగా, ఆ తర్వాత 2016 సంవత్సరంలో చంద్రబాబు ప్రభుత్వం 5.5 టీఎంసీలు, 2017లో 8 టీఎంసీలు నింపి పులివెందుల నియోజకవర్గానికి మొదటిసారిగా గండికోట ప్రాజెక్టు ద్వారా నీళ్లిచ్చారు. ఆ తర్వాత 2018లో 12 టీఎంసీల వరకు గండికోటకు నీటిని తెచ్చి పులివెందులకు తీసుకెళ్లిన ఘనత చంద్రబాబుదే. 2020లో ముఖ్యమంత్రి జగన్ నిర్వాసితులకు పూర్తిస్థాయి పరిహారం చెల్లించకుండా గండికోట ప్రాజెక్టులో 26.85 టీఎంసీల నీటిని నింపి తన నియోజకవర్గానికి నీటిని తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఊర్లను నీటితో నింపి నిర్దాక్షిణ్యంగా రాత్రికి రాత్రే ఊళ్లను ఖాళీ చేయించి ప్రజలను అవస్థల పాలు చేశారు. చివరకు ఈ బిడ్డను క్షమించంచండి అంటూ బహిరంగసభలో క్షమాపణతో సరిపెట్టుకున్నారు.

మైలవరం జలాశయానికి నీరు విడుదల

గండికోట ప్రాజెక్టు నుంచి మైలవరం జలాశయానికి శుక్రవారం నీటిని విడుదల చేశారు. ప్రస్తుతం 2500 క్యూసెక్కుల చొప్పున మైలవరానికి నీరు విడుదల చేస్తున్నట్లు డీఈ ఉమామహేశ్వర్లు తెలిపారు. అదేవిధంగా సీబీఆర్‌కు 1500 క్యూసెక్కులు, పెడిపాలెం రిజర్వాయర్ కు 770 క్యూసెక్కులు, వామికొండ, సర్వరాయసాగర్‌కు 700 క్యూసెక్కుల చొప్పున గండికోట ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

17 నుంచి స్వచ్ఛతా హి సేవ

- శ్రమదానంతోనే పరిశుభ్రత : కలెక్టర్

కడప(కలెక్టరేట్), సెప్టెంబరు 13: స్వచ్ఛ భారత్ దివస్ నేపథ్యంలో ఈ నెల 17వ తేదీ నుంచి అక్టోబరు 1 వరకు 'స్వచ్ఛతా హి సేవ' కార్యక్రమాలు చేపట్టాలని కలెక్టర్ లోతేటి శివశంకర్ క్షేత్ర స్థాయి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ నుంచి ఆర్డీవోలు, మండల అధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ అదితి సింగ్, డీఆర్వో గంగాధర్ గౌడ్, జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 17 నుంచి అక్టోబరు 1 వరకు జిల్లా వ్యాప్తంగా అన్ని మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీలలో స్వచ్ఛతా హి సేవ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఇందులో భాగంగా పరిసరాల పరిశుభ్రతపై మానవహారం, స్వచ్ఛతా పరుగు ర్యాలీ, మారథాన్ రన్, వర్క్ షాపులు ఏర్పాటు చేయాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, విద్యా సంస్థలు, బహిరంగ ప్రదేశాలలో శ్రమదానం నిర్వహించి పరిశుభ్రం చేయాలన్నారు. ప్రజాప్రతినిధులను భాగస్వాములను చేయాలన్నారు. సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా పారిశుధ్యంపై అవగాహన కల్పించాలన్నారు. తాగునీటి వనరుల క్లోరినేషన్, ఉద్యానవనాలు, పర్యాటక కేంద్రాల సుందరీకరణ తదితర పనులు చేపట్టాలన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు, చెత్తకుప్పలు, బోరుబావుల చుట్టు పక్కల ప్రదేశాల్లో మెగా శుభ్రత డ్రైవ్‌లు నిర్వహించాలన్నారు. ఎంపీడీఓలు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు, విస్తరణాధికారులు, సంబంధిత అధికారులు, గ్రామస్థాయి సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. స్వచ్ఛతా హి సేవ నిర్వహణలో ప్రజలు, విద్యార్థుల భాగస్వామ్యం ఉండాలన్నారు. సఫాయి కరమ్‌చారులకు రక్షణ పరికరాలు అందించడంతో పాటు ఆరోగ్య సదస్సులు నిర్వహించాలన్నారు. అన్ని గ్రామాల్లో తల్లి పేరున మొక్క (ఏక్ పేడ్ మాకే నామ్)లు నాటే కార్యక్రమం చేయాలన్నారు. శ్రమదానం ద్వారా చెరువులు, కుంటలు, కాలువల వద్ద వ్యర్థాల తొలగింపు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు ప్రభాకర్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, విజయ్ కుమార్, సరస్వతి, అనురాధ, వెంకట్రావ్, శారద, సురేశ్‌కుమార్ తదితర అధికారులు పాల్గొన్నారు.

ఇంజనీరింగ్, మెడిసిన్‌కు.. డిగ్రీ ఏమాత్రం తక్కువ కాదు

- సృజనాత్మక ఆలోచనలు, లోతైన జ్ఞానం కలిగి ఉండాలి
- తెలుసుకోవాలన్న తపన ఉంటే జీవితంలో రాణించగలం
- ఆర్ట్స్ కళాశాల ప్లాటినమ్ జూబ్లి ఉత్సవాల్లో కలెక్టర్ శివశంకర్


కడప (ఎడ్యుకేషన్), సెప్టెంబరు 13: ఇంజనీరింగ్, మెడిసిన్‌లకు డిగ్రీ ఏ మాత్రం తక్కువ కాదని కలెక్టర్ శివశంకర్ అన్నారు. సృజనాత్మక ఆలోచనలు, లోతైన జ్ఞానం ఉన్నవారు గొప్పస్థాయికి ఎదుగుతారని స్పష్టం చేశారు. కడప ప్రభుత్వ ఆర్ట్స్‌కళాశాల 75 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా శుక్రవారం ప్లాటినమ్ జూబ్లి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఉత్సవాలకు గుర్తుగా కళాశాల ప్రధాన ద్వారం వద్ద ఏర్పాటు చేసిన పైలాన్‌ను కలెక్టర్ శివశంకర్, ఎమ్మెల్యే మాధవి ఆవిష్కరించారు. అనంతరం ప్రిన్సిపల్ డాక్టర్ జి.రవీంద్రనాథ్ అధ్యక్షతన జరిగిన సభను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మనం ఏ స్థాయిలో ఉన్నా మూలాలు మరిచిపోకూడదనే విషయాన్ని కళాశాల గుర్తు చేస్తుందన్నారు. విద్య ద్వారానే మనం ఏదైనా సాధించవచ్చన్నారు. ప్రస్తుతం సమాజంలో అందరూ ఇంజనీరింగ్, మెడిసిన్ కోర్సుల్లో చేరిపోతున్నారని మేం మాత్రమే డిగ్రీ చదువుతున్నామని మిమ్మల్ని మీరు తగ్గించుకోవద్దని అన్నారు. ఈరోజు సీఎం వద్ద కార్యదర్శిగా ఉన్న ఐఏఎస్ అధికారి డిగ్రీ చదవినవారేనన్నారు. ఎంతోమంది ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు డిగ్రీతో వచ్చినవారేనని గుర్తుచేశారు. తెలుసుకోవాలనే తపన ఉండాలన్నారు. థామస్ అల్వా ఎడిసన్ బల్బు కనుగొనే ప్రయోగంలో 3వేల ప్రయత్నాలు తప్పినా మళ్లీ ప్రయత్నించి విజేతగా నిలవడాన్ని యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. పట్టుదలతో అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు. ఈ కళాశాల పేరును బట్టి బాలురు మాత్రమే ఇక్కడ చదువుతున్నారనే అర్థం వస్తుందని, అయితే బాలురు బాలికలు ఇద్దరూ చదువుకుంటున్నారని గుర్తుచేస్తూ ప్రభుత్వ డిగ్రీ కళాశాలగా మారుద్దామని తెలిపారు. పూర్వ విద్యార్థి, కడప ఎమ్మెల్యే ఆర్.మాధవి మాట్లాడుతూ 1992లో ఇంటర్మీడియట్ ఇక్కడ చదివానని అన్నారు. ఆనాడు ర్యాగింగ్ చేసిన విద్యార్థిపై చర్యలు తీసుకునేలా మొండికేశామని గుర్తు చేసుకున్నారు. ప్రిన్సిపల్ రవీంద్రనాథ్ మాట్లాడుతూ 1948లో ఏర్పాటైన ఆర్ట్స్‌కళాశాల నేటి వరకు ఎదిగిన క్రమం వివరించారు. రాష్ట్రంలో 170 డిగ్రీ కళాశాలలో జాతీయ స్థాయి సంస్థలు ఇచ్చే ర్యాంకుల్లోనూ, ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ జడ్జిలు, ఎందరో అధికారులను, ప్రజాప్రతినిధులను అందించి మేటిగా తమ కళాశాల నిలిచిందన్నారు.

మధ్యాహ్నం జరిగిన కార్యక్రమాల్లో అవధాన సాహిత్యంలో సదస్సులు అనే అంశంపై ప్రముఖ అవధాని నరాల రామారెడ్డి, తెలుగుభాష ప్రాశస్త్యంపై డాక్టర్ సాయిప్రసాద్ ప్రసంగించారు. సాయంత్రం భరత కళా క్షేత్రం ఆధ్వర్యంలో ప్రదర్శించిన శ్రీపద్మ శ్రీనివాసం నృత్యరూపకం ఆకట్టుకుంది. ప్లాటినమ్ జూబ్లి ప్రోగ్రాం కోఆర్డినేటరు ప్రొఫెసరు రాజశేఖర్‌రెడ్డి, లయన్ కె.చిన్నపరెడ్డి, అలుమ్ని పూర్వవిద్యార్థులు శాంతిస్వరూప్ భట్నాగర్, ఆచార్య ప్రకాశరావు, మాజీ వైస్‌చాన్సలర్ ప్రొఫెసరు రహ్మతుల్లా, చిన్నపరెడ్డి, డాక్టర్ సత్యనారాయణ, రామచంద్రన్, కందుల విద్యాసంస్థల అధిపతి కందుల రాజేశ్వరి, జనార్ధనరెడ్డిలను ఘనంగా సత్కరించారు. అలుమ్ని కార్యదర్శి కె.శివరాం, అధ్యాపకులు అలుమ్ని సభ్యులు పాల్గొన్నారు.



కడప ఆర్ట్స్ కళాశాల ప్లాటినమ్ జూబ్లి ఉత్సవాలకు జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కలెక్టర్ శివశంకర్

వేడుకగా గణపయ్య నిమజ్జనం



వినాయక చవితి సందర్భంగా కడప నగరంలోని ఎన్‌జీవో కాలనీలో కొలువుదీరిన భారీ బొజ్జ గణపయ్య నిమజ్జనం వేడుకగా సాగింది. శ్రీ వరసిద్ధి వినాయక ఉత్సవ కమిటీ చైర్మన్ ఎ.రాజగోపాల్‌రెడ్డి సారథ్యంలో వారం రోజులుగా భక్తుల పూజలందుకున్న గణనాథుడిని శుక్రవారం నిమజ్జనానికి తరలించారు. సరిగ్గా 3 గంటలకు వినాయకుడి భారీ విగ్రహాన్ని క్రేన్ సాయంతో ట్రాక్టర్ ట్రాలీపైకి చేర్చి ఊరేగింపుగా సిద్దవటం పెన్నానదికి తరలించారు. అంతకు ముందు బొజ్జ గణపయ్యకు కడప ఎమ్మెల్యే ఆర్.మాధవి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి చేతిలో ఉన్న 15 కిలోల లడ్డును లక్కీ డిప్ ద్వారా ఉక్కాయపల్లెకు చెందిన భక్తుడు సంటెయ్య దక్కించుకున్నారు. నిమజ్జన కార్యక్రమం తిలకించేందుకు నగర వాసులు, భక్తులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఊరేగింపు సందర్భంగా చెక్కభజన, కోలాటం, తప్పెట్లు, డ్రమ్స్, కేరళ వాయిద్యాలు ప్రజలను ఆకట్టుకున్నాయి. ఊరేగింపులో ముందు భాగాన లారీపై వివిధ సినిమా నటుల డూప్‌లు పలు సినిమా పాటలకు నృత్యాలు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘనలు చోటుచేసుకోకుండా ఉండేలా చిన్న చౌక్ సీఐ తేజామూర్తి, ఎస్‌ఐలు రాజరాజేశ్వరరెడ్డి, రవికుమార్ ఇతర పోలీసులు సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

- కడప (కల్చరల్)







అనాథలా ఆర్టీసీ కడప జోన్

- తిరుపతి రీజియన్‌కే పరిమితమైన ఇన్‌చార్జ్ ఈడీ
- ఆదాయ వనరులపై అంతంతమాత్రంగా శ్రద్ధ



కడప (మారుతీనగర్), సెప్టెంబర్ 13: అది ఘనత వహించిన ఆర్టీసీ కడప జోన్. ఇదివరకు నాలుగు జిల్లాలుగా ఉన్న కడప జోన్ ప్రస్తుతం 8 జిల్లాలుగా (కడప, అన్నమయ్య, అనంతపురం, సత్యసాయి, కర్నూలు, నంద్యాల, చిత్తూరు, తిరుపతి) మారింది. దీంతో డిపోల సంఖ్య 52కు చేరింది. ఇంతటి ప్రాధాన్యం ఉన్న కడప జోన్ అనాథలా మారింది. కారణం రెగ్యులర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఈడీ) లేకపోవడమే. ఈడీ పర్యవేక్షణలో ఆయా డిపోలకు చెందిన కిందిస్థాయి అధికారులు, వారి పర్యవేక్షణలో పనిచేసే వివిధ డిపోలలో ఉద్యోగులు (డ్రైవర్లు, కండక్టర్లు) ఒకరికొకరు సమన్వయంతో ఉంటేనే అనుకున్న లక్ష్యాలను అందుకోగలరు. అయినా రెండు నెలలుగా కడప జోన్‌కు గుండెకాయ లాంటి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ స్థాయి అధికారి నియామకంలో జాప్యం చోటుచేసుకుంది. ఇదివరకూ ఈడీగా పనిచేసిన అధికారిని ఆరోపణలు నేపథ్యంలో ఆర్టీసీ కేంద్ర కార్యాలయానికి బదిలీ చేశారు. దీంతో ఈడీ పర్యవేక్షణ కొరవడడంతో కడప జోన్‌కు అందాల్సిన ఆదాయ వనరులకు బ్రేకులు పడ్డాయని అంటున్నారు.

ఆదాయ వనరులు ఉన్నా..

కడప జోన్ వ్యాప్తంగా ఆర్టీసీ బస్టాండుకు చెందిన స్థలాలు, స్టాల్స్ ఉన్నాయి. వీటికి సంబంధించిన బాడుగలపై దృష్టి సారించకపోవడంతో ఆదాయం నామమాత్రంగా వస్తోందని అంటున్నారు. దీనిపై ఆర్టీసీ ఉన్నతాధికారులు సరైన దృష్టి సారిస్తే నెలవారీగా లక్షలాది రూపాయలు ఆదాయం సమకూర్చుకునే అవకాశాలున్నాయని సమాచారం. ఇదిలా ఉండగా కొన్ని బస్‌స్టేషన్లలోని స్టాల్స్ నుంచి ఏ నెలకానెల అద్దెల వసూళ్లలో అలసత్వం ప్రదర్శిస్తున్నట్లు తెలిసింది. పై స్థాయి అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా చేజేతులా అందాల్సిన ఆదాయం కూడా అందడం లేదనే ఆరోపణలున్నాయి. ఒక్క కడప బస్టాండులోనే అద్దెల తాలూకు కొన్ని లక్షల రూపాయల బకాయిలు సకాలంలో వసూలు కాలేదని సమాచారం. కడప జోన్ వ్యాప్తంగా ఇదే తంతు కొనసాగుతోందనే విమర్శలున్నాయి. ఇప్పటికే కొన్ని ఆర్టీసీ బస్టాండ్లలో స్థలాలు ఖాళీగా వున్నాయి. వాటిపై ఒక నిర్ణయం తీసుకుని ఏదేని ఇతర వ్యాపార సముదాయాలకు బాడుగలకిస్తే మరింత ఆదాయం సమకూరే అవకాశం ఉంది.

పర్మినెంట్ ఉద్యోగులు లేనికారణంగా..

పార్శిల్ రవాణా రంగంలోకి అడుగు పెట్టినప్పటి నుంచి ఆర్టీసీకి మరింత ఆదాయం సమకూరింది. ఓ రకంగా ఆర్టీసీ ఆదాయానికి పార్శిల్ రవాణా (కార్గో) సంజీవనిగా మారిందనడంలో ఏ మాత్రం సందేహం లేదు. తొలుత కొంతకాలం ఆర్టీసీ పార్శిల్ రంగాన్ని ఆర్టీసీకి చెందిన ఉద్యోగుల ద్వారా నిర్వహించడంతో కోట్లలో ఆదాయం పెరిగింది. కాలగమనంలో పార్శిల్ రంగాన్ని కాంట్రాక్టర్లకు అప్పగించడం, అక్కడ పర్మినెంట్ ఉద్యోగుల పర్యవేక్షణ లేని కారణంగా ఆర్టీసీ ఆదాయానికి గండి పడుతోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పైపెచ్చు అక్కడ పనిచేసే కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు అంతా పార్శిల్స్ తూకంలో, బిల్లుల పంపకాలలో చేతి వాటం ప్రదర్శిస్తున్నారనే విమర్శలున్నాయి.

వచ్చామా.. వెళ్లామా అన్నట్లుగా ఇన్‌చార్జ్ ఈడీ

కడప జోన్ ఇన్‌చార్జ్ ఈడీగా బాధ్యతలు స్వీకరించిన తిరుపతి రీజియన్‌కు చెందిన ఓ అధికారి ఆ రీజియన్‌కే పరిమితమయ్యారని అంటున్నారు. వచ్చామా.. వెళ్లామా అన్నట్లుగా కడపలోని ప్రధానకార్యాలయానికి రావడం, అంతే వేగంగా తిరుపతి రీజియన్‌కు వెళ్లడం పరిపాటిగా మారిందనే విమర్శలున్నాయి. దీంతో ఈ రీజియన్‌లో ఉద్యోగుల మధ్య సమన్వయం కొరవడ్డంతో పాటు ఆదాయం కుంటుపడిందని అంటున్నారు. ఇదివరకు ప్రభుత్వరంగ సంస్థగా ఉన్న ఆర్టీసీ ప్రస్తుతం ప్రభుత్వ సంస్థగా మారిన సంగతి తెలిసిందే. ప్రయాణికులకు సరైన సౌకర్యాలు కల్పించడంతో పాటుగా ఉద్యోగుల సంక్షేమం చూడాల్సిన గురుతర బాధ్యత కూడా ఆర్టీసీపైనే ఉంది. ఆ దిశగా ఆర్టీసీ అధికారులు దృష్టి సారించి ఆర్టీసీ కడప జోన్‌ను లాభాలబాట పట్టించేందుకు వీలుగా త్వరితగతిన రెగ్యులర్ ఈడీని నియమించాలని ఆ సంస్థ ఉద్యోగులు కోరుతున్నారు.

అదనపు ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన ప్రకాశ్‌బాబు

కడప (క్రైం), సెప్టెంబరు 13 : జిల్లా అదనపు ఎస్పీ (పరిపాలన)గా ప్రకాశ్‌బాబు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఏఎస్పీగా పనిచేసిన లోసారి సుధాకర్ బదిలీ కావడంతో డీఎస్పీగా పనిచేస్తున్న ప్రకాశ్‌బాబుకు అదనపు ఎస్పీగా పదోన్నతి కల్పించి కడపకు బదిలీ చేశారు. ఈయన ఎస్‌ఐగా, డీఎస్పీగా రాష్ట్రంలోని పలు పోలీసుస్టేషన్లలో విధులు నిర్వహించారు.

అసభ్య పోస్టుల కేసులో అహ్మద్‌బాషాకు 41ఏ నోటీసు

- నేడు విచారణకు రావాలని ఆదేశం

కడప (క్రైం), సెప్టెంబరు 13: రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత, కడప ఎమ్మెల్యే ఆర్.మాధవిపై అసభ్య పోస్టులను సోషల్ మీడియాలో పోస్టు చేసిన కేసుకు సంబంధించి చిన్న చౌకు పోలీసులు మాజీ డిప్యూటీ సీఎం సోదరుడు అహ్మద్‌బాషాకు 41ఏ నోటీసు అందించారు. ఈ మేరకు శనివారం విచారణకు రావాలని అందులో పేర్కొన్నారు. గతంలో సోషల్ మీడియాలో అసభ్య పదాలతో కూడిన పోస్టులను వైసీపీవారు వైరల్ చేశారు. ఇందుకు సంబంధించి టీడీపీ నేతల ఫిర్యాదు మేరకు గతంలో పలువురిపై కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో ఆ కేసుకు సంబంధించి అహ్మద్‌బాషాను విచారించనున్నామని సీఐ తేజమూర్తి తెలిపారు.

కాంగ్రెస్ ముఖ్య అధికార ప్రతినిధిగా తులసిరెడ్డి



వేంపల్లె, సెప్టెంబరు 13: కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధిగా రాజ్యసభ మాజీ సభ్యుడు తులసిరెడ్డిని అధిష్టానం నియమించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాబోవు ఎన్నికల్లో కేంద్రంలోను, రాష్ట్రంలోను అధికారమే లక్ష్యంగా పనిచేస్తామని అన్నారు. ఈ సందర్భంగా తులసిరెడ్డిని స్థానిక కాంగ్రెస్ నేతలు పలువురు శాలువ, పూలమాలలతో సత్కరించారు.

పేదల సొంతింటి కల నెరవేరేనా...

- జగనన్న కాలనీల్లో ఆగిన ఇళ్ల నిర్మాణాలు
- బేస్‌మెంట్లు, శ్లాబు స్థాయిలో నిలిచిపోయిన వైనం
- పట్టణంలోని 8 లేఅవుట్లలో ఇదే పరిస్థితి


చెన్నంపల్లె జగనన్న కాలనీలో పూర్తి కాని ఇళ్ల నిర్మాణాలు

బద్వేలు రూరల్, సెప్టెంబరు 13: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి తాను అధికారంలో ఉన్నప్పుడు పేదలకు స్థలంతో పాటు ఇల్లు నిర్మిస్తామని ఇచ్చిన హామీ కార్యరూపం దాల్చలేదు. జగనన్న కాలనీల పేరిట లేఅవుట్లను ఏర్పాటు చేసి ఇంటి నిర్మాణాలు ప్రారంభించి దాదాపు రెండేళ్లు పూర్తయింది. కాలనీల్లో వాటర్ ట్యాంకులు, ఓవర్ హెడ్ ట్యాంకుల ద్వారా నీటి సౌకర్యం, విద్యుత్ సరఫరా ఏర్పాటు చేస్తామన్న మాటలు నీటి మూటలయ్యాయి. బద్వేలు పట్టణంలో దాదాపు నాలుగు లేఅవుట్లలో 8 వెంచర్లలో ప్రారంభమైన జగనన్న ఇళ్లు బేస్‌మెంట్లు, శ్లాబు లెవల్ వరకు అధిక సంఖ్యలో ఉండగా, పూర్తయినవి మాత్రం పది శాతం మాత్రమే ఉన్నాయి. ఇంత వరకు అన్ని లేఅవుట్లలో ఇంటి నిర్మాణాలు పూర్తికాకపోవడంతో పేద ప్రజల సొంతింటి కల కలగానే మిగిలిపోయింది.

బద్వేలు పరిధిలో నాలుగు లేఅవుట్లలోని 8 వెంచర్లలో లబ్ధిదారులకు ఇంటి స్థలాలు మంజూరు చేశారు. దాదాపు ఈ లేఅవుట్లలో 5507 మందికి ఇంటిస్థలాలు కేటా యించగా.. 4396 ఇళ్లు మంజూరయ్యాయి. అందులో ఇప్పటి వరకు 515 ఇళ్ల నిర్మాణాలు మాత్రమే పూర్తయ్యాయి. అంటే కేవలం 10 శాతం మాత్రమే ఇళ్లు పూర్తి కాగా.. 90 శాతం ఇళ్లు వివిధ స్థాయిల్లో ఆగి ఉన్నాయి. ఎప్పటికీ పూర్తవుతాయో కూడా తెలియని పరిస్థితి. దీంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు.

జగనన్న కాలనీల్లో అర్హులైన లబ్ధిదారులందరికీ 2 సెంట్లు స్థలం కేటాయించి.. ఇళ్లు నిర్మిస్తామని ఆనాటి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారు. రూ.లక్షా 80వేలకు మాత్రమే ప్రభుత్వం ఇళ్లు నిర్మిస్తుందంటూ అవసరమైతే లబ్ధిదారుడే మిగిలిన మొత్తాన్ని భరించాల్సిందంటూ మాట మార్చారు. మళ్లీ లబ్ధిదారుల నుంచి వ్యతిరేకతను గమనించి డ్వాక్రాలో జగనన్న ఇంటిని పొందిన లబ్ధిదారులకు డ్వాక్రా సంఘాల ద్వారా మరో రూ.35వేలు రుణం తీసుకోవచ్చంటూ ఆదేశాలు జారీ చేశారు. అంతా కలిపి రూ.2.15 లక్షల్లో అప్పటి ప్రభుత్వం చెప్పిన రీతిలో ఇళ్లు నిర్మించుకునే పరిస్థితి లేదని లబ్ధిదారులు చెబుతున్నారు. తాము సొంత డబ్బులు వెచ్చించి ఇంటి నిర్మాణం చేపట్టి ఇంట్లో చేరినప్పటికీ కాలనీలో మౌలిక సదుపాయాలు లేవని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలపై ఆశలు పెట్టుకున్నారు.

విద్యారంగాన్ని భ్రష్టు పట్టించిన వైసీపీ : ఎమ్మెల్సీ


వేంపల్లెలోని ఉర్దూజూనియర్ కళాశాలలో విద్యార్థులకు ప్రశంసాపత్రాలను అందిస్తున్న ఎమ్మెల్సీ

వేంపల్లె, సెప్టెంబరు 13: వైసీపీ పాలనలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అవగాహనరాహిత్యం, తొందరపాటు నిర్ణయాలతో విద్యారంగాన్ని భ్రష్టుపట్టించారని ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి విమర్శించారు. ఉపాధ్యాయులకు సరైన శిక్షణ, మౌలిక వసతులు లేకుండానే పాఠశాలల్లో సీబీఎస్‌ఈ ప్రవేశపెట్టారని అన్నారు. టీడీపీ ప్రభుత్వం ఈ ఏడాది సీబీఎస్‌ఈ సిలబస్‌లో కాకుండా స్టేట్ సిలబస్‌లోనే 10వ తరగతి పరీక్షలు నిర్వహించాలనే నిర్ణయం తీసుకుందన్నారు. ఆయన శుక్రవారం వేంపల్లెలోని ఉర్దూ జూనియర్ కళాశాలలో విద్యార్థులతో సమావేశమయ్యారు. ప్రభుత్వం సరఫరాచేసిన బ్యాగులను వారికి అందజేశారు. ఆటలపోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందించారు. కళాశాల ఆవరణంలో ఆర్జేడీ రవి, ఆర్‌ఐఓ సుబ్బయ్యతో కలిసి మొక్కలు నాటారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ జూనియర్, డిగ్రీ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం ఏర్పాటుచేసి పేద విద్యార్థులకు చదువులు అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా కళాశాల అభివృద్ధికి అన్ని చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సీసీకెమెరాల ఏర్పాటుకు ఆర్థిక సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. మాజీ ఎంపీటీసీ సభ్యుడు జీవీ రమణ, టీడీపీ నాయకులు పోలిరెడ్డి శివ, భానుకిరణ్, దేశం వెంకటసుబ్బారెడ్డి, మైసూరారెడ్డి, బాబా షరీఫ్, పఠాన్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి చదువు-ఆటలు రెండు కళ్లలాంటివి

చక్రాయపేట, సెప్టెంబరు 13: ప్రతి విద్యార్థికి విద్యతో పాటు ఆటలు కూడా ముఖ్యమని, విద్యార్థికి విద్య విజ్ఞానాన్ని ఇస్తే... ఆటలు ఆరోగ్యాన్ని ఇస్తాయని.. విద్యతోపాటు ఆటల్లో కూడా రాణించాలని ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. ఆయన శుక్రవారం అండర్-19 బాలబాలికల హ్యాండ్‌బాల్, బాస్కెట్‌బాల్, రగ్బీ, త్రోబాల్, నెట్‌బాల్ ఆటల పోటీలను గండి గురుకుల పాఠశాలలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరిలో ఒక నైపుణ్యం ఉంటుందని.. దాన్ని వెలికితీసి రాష్ట్రస్థాయికి ఎంపిక కావాలని కోరారు. ఆర్జేడీ రవి, ఆర్‌ఐఓ వెంకటసుబ్బయ్య, స్కూల్ గేమ్ ఆర్గనైజర్ సెక్రటరీ శారద, జిల్లా క్రీడా జూనియర్ కళాశాలల గేమ్స్ అండ్ స్పోర్ట్స్ విజయప్రసాద్‌రెడ్డి, చక్రాయపేట జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ షేక్ రంతుబాషు, ఎంఈఓ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

రూ.50వేలు వితరణ: ఇటీవల గువ్వలచెరువు ఘాట్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన చక్రాయపేట వాసి డ్రైవర్ షేక్ షరీఫ్ కుటుంబాన్ని పరామర్శించి రూ.50వేలు ఆర్థికసాయాన్ని ఎమ్మెల్సీ అందించారు. బాధిత కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకునేందుకు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు.

సమస్యల పరిష్కారానికి ధైర్యంగా పోరాడాలి

- ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీ పరిపా లన అధికారి

వేంపల్లె, సెప్టెంబరు 13: సమస్యలు వచ్చినపుడు కుంగిపోకుండా ధైర్యంగా పోరాడాలని, ఆత్మహత్య చేసుకోవడం పరిష్కారం కాదని ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీ పరిపాలన అధికారి పెనుగొండ రవికుమార్ తెలిపారు. ఆర్జీయూకేటీ రిజిస్ట్రార్ అమరేంద్ర కుమార్ సంద్ర, డైరెక్టర్ కుమారస్వామి గుప్త ఆదేశాల మేరకు ఆత్మహత్యల వ్యతిరేక కార్యక్రమ కౌన్సెలింగ్‌లో భాగంగా శుక్రవారం విద్యార్థినీ విద్యార్థులకు సమావేశం నిర్వహించారు. చిన్నచిన్న సంఘటనల వల్ల బాధపడకుండా తోటి స్నేహితులకు చెప్పుకోవాలని, అవసరమైతే యాజమాన్యం దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవాలన్నారు. వ్యక్తిగత సమస్యలు ఉన్నా, కళాశాలలో సమస్యలు ఉన్నా అధ్యాపకులకు తెలియజేయాలని సూచించారు. ఎంతో మందికి దక్కని అవకాశం ట్రిపుల్‌ఐటీల్లో మీకు దక్కిందని, కష్టపడి చదువుకొని ఉన్నత ఉద్యోగ ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలని ఏఓ సూచించారు. కార్యక్రమంలో అధికారులు రత్నకుమారి, మధుసూదన్, గోవర్ధన్, తిరుపతిరెడ్డి, విశ్వనాథరెడ్డి, ఇందుమతి, సుబ్బరాయుడు, అనిల్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థిని ఆత్మహత్య


విద్యార్థిని మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

జమ్మలమడుగు, సెప్టెంబరు 13: జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలోని గాయత్రినగర్‌లో శుక్రవారం ఆదిమూలపు ప్రసన్న (16) అనే విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు... పట్టణంలోని ఓ ప్రైవేటు కళాశాలలో ప్రసన్న ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతోంది. గత మూడు రోజుల నుంచి కళాశాలకు వెళ్లలేదు. మధ్యాహ్నం ఇంటిలో ఎవరూ లేని సమయంలో ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కూలి పనులకు వెళ్లిన తల్లి లక్ష్మి, తండ్రి గోపాల్ ఇంటికొచ్చి చూసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనా స్థలానికి అర్బన్ పోలీసులు చేరుకుని విచారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కళాశాలకు వెళ్లడం ఇష్టం లేక ఆత్మహత్య చేసుకుందని తండ్రి తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ లింగప్ప తెలిపారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి


బాలయ్య మృతదేహం

పెండ్లిమర్రి, సెప్టెంబరు 13: కడప-పులివెందుల ప్రధాన రహదారిపై గుర్తుతెలియని వాహనం ఢీకొని బాలయ్య (55) అనే వ్యక్తి శుక్రవారం మృతి చెందాడు. స్థానికుల, పోలీసుల కథనం మేరకు తెల్లవారుజామున రోడ్డు పక్కన బహిర్భూమికి వెళ్లి కూర్చొని ఉండగా గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి తెలిపారు.

సొంత అన్ననే కడతేర్చిన తమ్ముడు


మృతి చెందిన బాబా ఫకృద్దీన్

- మద్యం మానివేయమన్నందుకు సమ్మెటతో దాడి

పులివెందుల టౌన్, సెప్టెంబరు 13: మద్యానికి బానిస అయిన తమ్ముణ్ని మందలించినందుకు సొంత అన్ననే సమ్మెటతో కొట్టి కడతేర్చిన సంఘటన పులివెందులలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. పులివెందుల మండలంలోని రాయలాపురం గ్రామానికి చెందిన సరితాల బాబయ్య అలియాస్ ఎర్రోడు అనే వ్యక్తి మద్యానికి బానిసై పనిచేయకుండా తిరుగుండేవాడు. గురువారం రాత్రి అతని సోదరుడు సరితాల బాబా ఫకృద్దీన్ అలియాస్ బుడ్డయ్య మందలించాడు. దీంతో మానసికంగా కలత చెందిన బాబయ్య శుక్రవారం ఇంట్లో ఉన్న రాళ్లు పగలగొట్టే సమ్మెట (సుత్తె) తీసుకుని ఇంటి బయట మంచంపై పడుకుని ఉన్న బాబాఫకృద్దీన్‌ను కొట్టి పారిపోయాడు. దీంతో తీవ్రంగా గాయపడ్డ బాబా ఫకృద్దీన్‌ను పులివెందుల ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా వైద్యులు పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రిలోని పోస్టుమార్టం గదికి తరలించారు. ఈసంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

యువతి అదృశ్యం

కాశినాయన సెప్టెంబరు 12: మండలంలోని నాయనపల్లెకు చెందిన దాసరి రమ్యతేజ (19) అనే యువతి అదృశ్యమైనట్లు కుటుంబీకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాలిలా.. నాయనపల్లెకు చెందిన శ్రీనివాసులు వీరసుబ్బమ్మ దంపతుల కుమార్తె రమ్యతేజ ఈనెల 10వ తేదీ ఇంటి నుంచి వెళ్లిపోయింది. బంధువులు, తెలిసినవాళ్ల ద్వారా ఆరా తీసినా ఆచూకీ లభించలేదు. యువతి తల్లి నర్సాపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఏఎస్ఐ రమణ తెలిపారు.

జిల్లాలో స్వచ్ఛతాహిసేవా కార్యక్రమాలు : జేసీ



స్వచ్ఛతాహిసేవ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జాయింట్ కలెక్టర్ ఆదర్శరాజేంద్రన్

రాయచోటి (కలెక్టరేట్) సెప్టంబరు 13: ఈనెల 17 నుంచి వచ్చే నెల 1వ తేదీ వరకు స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమాలు చేపట్టాలని జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి డివిజన్, మండలస్థాయి అధికారులు, మున్సిపల్, ప్రత్యేక అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కార్యక్రమానికి డీఆర్‌ఓ సత్యనారాయణ, వివిధ జిల్లాల అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ఆక్టోబర్ 2 నుంచి స్వచ్ఛభారత్ దివస్ నిర్వహించనన్న నేపథ్యంలో ఈనెల 17 నుంచి ఆక్టోబర్ 2వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా అన్ని మున్సిపాలిటీలు, పంచాయతీలలో ఈ కార్యక్రమం నిర్వహించాలని ఆదేశించారు. 15 రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమాన్ని అధికారులందరు సమన్వయంతో నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో భాగంగా పరిసరాల పరిశుభ్రతపై మానవహారం, ర్యాలీలు, మారథన్‌రన్ తదితర కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ప్రభుత్వ కార్యాలయాలలో, విద్యాసంస్థలలో ప్రతిజ్ఞ పాటించి శ్రమదానం నిర్వహించాలన్నారు. ముఖ్యంగా గ్రామాలలో రోడ్లు, చెత్తకుప్పలు, బోరుబావుల చుట్టుపక్కల శుభ్రంగా వుండేలా ఒక డ్రైవ్ నిర్వహించాలన్నారు. ఎంపీడీఓలు, ఈఓఆర్‌డీలు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, కార్యదర్శులు దృష్టి సారించాలన్నారు. అలాగే గ్రామలలో పెద్ద ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమాలు చేపట్టాలన్నారు. కార్యక్రమం అనంతరం స్వచ్ఛతాహి సేవ ప్రచారం పోస్టర్లను జాయింట్ కలెక్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో డ్వామా పీడీ, డీఆర్‌డీఏ, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ అధికారులు పాల్గొన్నారు.

గృహనిర్మాణంలో లక్ష్యాలను సాధించాలి...

జిల్లాలో గత రెండు వారాలుగా గృహ నిర్మాణంలో జీరో శాతం వున్న వారు వారంలోగా లక్ష్యాలను సాధించాలని.. లక్ష్యసాధనలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో అధికారులతో వారు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం జేసీ మాట్లాడుతూ గత 15 రోజులుగా గృహనిర్మాణలలో 64 సచివాలయ పరిధిలో జీరో శాతం ప్రగతి వుందన్నారు. జిల్లాలో నిమ్మనపల్లి, చిట్వేలి, మదనపల్లి అర్బన్, గుర్రంకొండ తదితర ప్రాంతాలలో ఇళ్ల నిర్మాణాలు చాలా అధ్వాన స్థితిలో ఉన్నాయన్నారు. ఎంపీడీఓలు, ప్రత్యేక అధికారులు, గృహ నిర్మాణశాఖతో సమన్వయం చేసుకుని ముందుకు సాగాలన్నారు. సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్, నదియాదేవి, ఆర్‌డీఓ రంగస్వామి, హౌసింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కువైత్‌కు పంపిస్తానంటూ మోసం

- పోలీసులను ఆశ్రయించిన బాధితులు

కమలాపురం రూరల్, సెప్టెంబరు 13: ఎర్రగుంట్ల పట్టణానికి చెందిన గౌస్ అనే ఏజంటు తమను కువైత్‌కు పంపిస్తామంటూ మోసం చేశాడని కమలాపురం పట్టణానికి చెందిన మహబూబ్‌బాషా, షఫీ అనే బాధితులు వాపోయారు. శుక్రవారం వారు మాట్లాడుతూ కువైత్ పంపిస్తామని గౌస్ చెప్పడంతో తాము రూ.1.50 లక్షలు డబ్బులు ఇచ్చామని.. అయితే తమను కువైత్‌కు పంపకుండా.. డబ్బులు అడిగితే ఇవ్వకుండా తిప్పుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గట్టిగా నిలదీయడంతో ఎవరి డబ్బులు వారికి చెల్లిస్తానంటూ కొంతకాలం కాలయాపన చేస్తూ మిన్నకుండి పోయాడన్నారు. దీంతో ఎర్రగుంట్ల పోలీసులను ఆశ్రయించామని బాధితులు తెలిపారు. హెడ్‌కానిస్టేబుల్ ఏజంటుకు వత్తాసు పలుకుతున్నాడని వారు తెలిపారు. ఈవిషయమై అధికారులు విచారించి తమకు డబ్బులు తిరిగి ఇప్పించేలా చర్యలు తీసుకోవాలని షఫి, మహబూబ్‌బాషా వేడుకున్నారు.

17న జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం

కడప (కలెక్టరేట్), సెప్టెంబరు 13: జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా ఈనెల 17వ తేదీ 0-19 ఏళ్ల వయస్సు వారికి అల్బెండజోల్ మందు లు వేయడం జరుగుతుందని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ నాగరాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రక్తహీనత, ఆకలి మందగించడం, మలంలో రక్తం పడు ట, వికారం, విరేచనాలు తదితర సమస్యలు నులిపురుగుల కారణంగా వస్తాయని.. అలాంటి వారందరికీ వయసు వారీగా అల్బెండజోల్ మందులు వేస్తామని తెలిపారు. అంగన్వాడీ, పాఠశాలల్లో విద్యార్థులకు మందులు మింగించడం వల్ల నులిపురుగులను నిర్మూలన చేయవచ్చన్నారు.

ద్విచక్రవాహనం ఢీ.. మహిళ మృతి

కడప(క్రైం), సెప్టెంబరు 13: కడప నగరం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో రాజేశ్వరి(50) అనే మహిళ మృతి చెందినట్లు ఎస్ఐ అమర్‌నాథ్‌రెడ్డి తెలిపారు. ఎస్ఐ వివరాల మేరకు.. దేవుని కడపకు చెందిన రాజేశ్వరి ఎర్రముక్కపల్లెలోని బట్టల దుకాణంలో పనిచేసేది. విధులు ముగించుకుని ఇంటికెళుతుండగా ద్విచక్రవాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడింది. చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని మార్చురీకి తరలించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

లారీ ఢీకొని కూలీ మృతి

తాడిపత్రి, సెప్టెంబరు 13: అనంతపురం జిల్లా తాడిపత్రి మండలం ఇగుడూరు గ్రామ సమీపంలో శుక్రవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో కూలీ మృతి చెందినట్లు రూరల్ సీఐ శివగంగాధర్‌రెడ్డి తెలిపారు. కడప జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన గంగయ్య (40) మండలంలోని చుక్కలూరు గ్రామం వద్ద ఉన్న బొగ్గులబట్టీలో కూలి పని చేస్తుండేవాడు. అయితే పని నిమిత్తం ద్విచక్రవాహనంలో ఇగుడూరుకు వెళుతుండగా వాహనం మరమ్మతుకు గురికావడంతో దానిని రోడ్డు పక్కన ఆపేసి నడుచుకుంటూ వెళుతున్నాడు. ఆ సమయంలో వెనుక నుంచి గుర్తుతెలియని లారీ వేగంగా వచ్చి ఢీకొనడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. స్థానికులు అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందు తూ మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నట్లు సీఐ చెప్పారు.

క్రీడాశాఖ మంత్రి సహకారంతో అంతర్జాతీయస్థాయి హాకీ స్టేడియం

- హాకీ అకాడమీ అన్నమయ్య జిల్లా సెక్రటరీ


క్రీడాశాఖ మంత్రికి వినతి పత్రం అందజేస్తున్న నాగేశ్వరరావు

రాయచోటిటౌన్, సెప్టెంబరు 13: రాష్ట్ర రవాణా, యువజన, క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సహకారంతో రాయచోటిలో అంతర్జాతీయస్థాయి హాకీ స్టేడియం నిర్మాణానికి కృషి చేయనున్నట్లు హాకీ అకాడమీ అన్నమయ్య జిల్లా సెక్రటరీ ఇడగొట్టు నాగేశ్వరరావు పేర్కొన్నారు. శుక్రవారం ఆయన విజయవాడలోని సచివాలయంలో మంత్రి రాంప్రసాద్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి.. రాయచోటి పట్టణంలో అంతర్జాతీయస్థాయి హాకీ స్టేడియం నిర్మా ణానికి కృషి చేయాలని వినతి పత్రం అందజేశారు. రాయచోటి పట్టణంలో సుమారు 120 మంది క్రీడాకారులు హాకీ ఆడుతున్నట్లు తెలిపారు. వారికి ఇక్కడ స్టేడియం లేకపోవడంతో పాటు సరైన సౌకర్యాలు లేక హాకీక్రీడలో ఉత్తమ ప్రదర్శన ఇవ్వలేకపోతున్నారని చెప్పారు. ఇక్కడ హాకీ క్రీడాకారు లకు సరైన సౌకర్యాలు కల్పిస్తే... రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఇందుకు స్పందించిన మంత్రి మాట్లాడుతూ రాయచోటి పట్టణంలో అంతర్జాతీయస్థాయి హాకీ స్టేడియం నిర్మాణానికి కృషి చేద్దామన్నారు. కలెక్టర్‌తో చర్చించి స్టేడియం నిర్మాణానికి స్థల సేక రణ చేద్దామని మంత్రి చెప్పినట్లు ఆయన తెలియజేశారు.

వెలిగల్లు కుడికాల్వకు నీరు నిలుపుదల

గాలివీడు, సెప్టెంబరు 13: వెలిగల్లు జలాశయంలో నీటి నిల్వలు తగ్గిన దృష్ట్యా కుడికాల్వ నీటిని నిలుపుదల చేస్తున్నట్లు వెలిగల్లు ప్రాజెక్టు డీఈఈ శిరీష్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. గాలివీడు, రాయచోటి మండ లాలకు విధిగా శుద్ధి చేసిన నీటిని తాగునీటి అవసరాల కోసం ఉప యోగించాల్సి ఉన్నందున కొంత నీటి నిల్వలను ఉంచుతున్నట్లు తెలిపారు. తదుపరి నీటి నిల్వలు పెరిగిన అనంతరం వ్యవసాయ అవసరాలకు సాగునీ టిని కాలువల ద్వారా విడుదల చేస్తామని తెలిపారు.

అమ్మవారి మెడలో నగ దొంగలించిన ఇద్దరు అరెస్టు

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 13: రామాలయంలో అమ్మవారి మెడలో బంగారు నగ దొంగిలించిన ఇద్దరి యువకులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తాలుకా సీఐ కళా వెంకటరమణ తెలిపారు. పోలీసుల కథనం మేరకు మొలకదిన్నెకు చెందిన హరీష్ అలయాస్ హరి (29), సాయిప్రతాష్ అలియాస్ ప్రతాప్(25) ఈ నెల 10వ తేదీన మొలకదిన్నెలోని రామాలయంలో అమ్మవారి మెడలోని బంగారు నగ 2.1 గ్రామాలు దొంగిలించారు. వారిద్దరూ తాగుడుకు అలవాటు పడి ఆలయంలో దొంగతనాలకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. ఆలయ పూజారి శశికాంత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి వారిని రిమాండ్ తరలించినట్లు సీఐ చెప్పారు.

ఆయాలకు పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలి



ఏఐటీయూసీ ఆధ్వర్యంలో డీఈవో కార్యాలయం ఎదుట ధర్నాలో ప్రభుత్వ పాఠశాలల ఆయాలు

రాయచోటిటౌన్, సెప్టెంబరు 13: అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఆయాలకు గత 7 నెలులగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను ప్రభుత్వం తక్షణమే చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, వర్కింగ్ ప్రెసిడెంట్ సిద్దిగాళ్ల శ్రీనివాసులు డిమాండ్ చేశారు. శుక్రవారం డీఈవో కార్యాలయం వద్ద ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఆయాలకు కేవలం రూ.6వేలు జీతం ఇస్తున్నారని, అది కూడా 7 నెలలుగా ఇవ్వకపోవడంతో అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. అధికారులు తక్షణం స్పందించి పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. పెరిగిన నిత్యావసర సరుకుల ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల ఆయాల వర్కర్స్ యూనియన్ నాయకులు నరసింహులు, వేణుగోపాల్‌రెడ్డి, యశోదమ్మలు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే ఆయాలకు ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని, సంవత్సరానికి రెండు జతల యూనిఫాం ఇవ్వాలని, శానిటేషన్ కార్మికులకు 4వ తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని, ఈపీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆయాలు యశోదమ్మ, శ్రీలక్ష్మి, వెంకటరత్నమ్మ, భారతి, విమల, నీరజా, లక్ష్మిదేవి, శంకరా, సుజాత, సంధ్య, ధనమ్మ, ఇంద్రాణి, అనీమా తదితరులు పాల్గొన్నారు.

రూ.7 కోట్ల బిల్లులు మంజూరైనా..

● వేంపల్లెలో మొదలు కాని సిమెంటు రోడ్డు ● గుంతల రోడ్డు, దుమ్ముధూళితో ప్రజల అవస్థలు







పులివెందులలో ఒకవైపు సిమెంటు రోడ్డు, రెండవ వైపు గుంతల రోడ్డు ఉన్న దృశ్యం.. అధ్వానంగా వేంపల్లె-పులివెందుల రోడ్డు ... అసంపూర్తి నిర్మాణాలతో కనిపిస్తున్న వేంపల్లె నాలుగురోడ్ల కూడలి

వేంపల్లె, సెప్టెంబరు 13: వైసీపీ ప్రభుత్వ హయాంలో వేంపల్లెలోని ప్రధాన రోడ్లలో సిమెంటు రోడ్డు, మురుగుకాల్వల నిర్మాణానికి పనులు మంజూరయ్యాయి. ఎలక్షన్‌కు కొద్దినెలల ముందు హడావిడిగా పనులు చేపట్టి బిల్లులు రాలేదని కాంట్రాక్టర్ మధ్యలోనే పనులు నిలిపివేసి చేతులెత్తేశారు. ఎన్నికల అనంతరం టీడీపీ ప్రభుత్వం ఏర్పాటైంది. ఈ రోడ్డుకు ముందు ప్రభుత్వమే బిల్లులు ఇవ్వలేదు, కొత్తగా వచ్చిన ప్రభుత్వం ఎప్పుడిస్తుందో, పనులు ఎప్పుడు ప్రారంభమవుతాయో, దుమ్ముధూళి, గుంతల రోడ్లతో ఎన్నాళ్లు భరించాలో అంటూ స్థానిక ప్రజలు వేదనలో ఉన్నారు. కానీ టీడీపీ ప్రభుత్వం రూ.7కోట్లకు పైగా ఉన్న పెండింగ్ బిల్లులను 20 రోజుల కిందటే ఇడుదల చేసింది. త్వరలోనే పనులు తిరిగి ప్రారంభమవుతాయని ప్రజలు భావించారు. కానీ 20 రోజులు దాటినా పనులు ప్రారంభం కాకపోవడం ఏమిటని చర్చించుకుంటున్నారు.

అర్థంతరంగా నిలిచిన సీసీ రోడ్లు, మురుగు కాల్వల పనులు

వేంపల్లె పట్టణంలో ప్రధాన రోడ్లు అయిన హనుమాన్ జంక్షన్ నుంచి కడప రోడ్డులో నాలుగు రోడ్ల కూడలి మీదుగా పులివెందుల రోడ్డు ఎన్టీఆర్ సర్కిల్ వరకు, నాలుగురోడ్ల కూడలిలోని గండిరోడ్డు నుంచి బైపాస్ రోడ్డు వరకు సిమెంటు రోడ్డు ఏర్పాటు, మురుగుకాల్వల నిర్మాణానికి రూ.28 కోట్లు మంజూరయ్యాయి. ఎంసీఎస్ఆర్ కంపెనీ పనులను చేపట్టింది. పులివెందుల రోడ్డు ఎన్టీఆర్ సర్కిల్ నుంచి ఒకవైపున 1600 మీటర్ల సీసీ రోడ్డు మాత్రమే ఇప్పటి వరకు వేశారు. పట్టణంలోప్రిధాన రోడ్లలో రెండు వైపుల కలిసి ఆరు కిలోమీటర్ల మేర కాల్వ నిర్మాణ పనులు చేపట్టారు. ఇంకా చాలాచోట్ల కాల్వ నిర్మాణ పనులు కొదవలుఉన్నాయి. ఈలోగా ఎన్నికలు దగ్గర పడడంతో పెట్టిన బిల్లులు మంజూరు కాకపోవడంతోపనులను అర్థాంతరంగా పూర్తిగా నిలిపివేశారు. అప్పటి నుంచి స్థానిక ప్రజలకు కష్టాలు మొదలయ్యాయి. గుంతల రోడ్లు, కొదవలు ఉన్న మురుగుకాల్వల గుంతలతోను, దుమ్ము, ధూళితో తీవ్ర అసౌకర్యం చెందుతున్నారు. ఈ పరిస్థితి ఎన్నాళ్లు ఉంటుందోనని ప్రజలు చర్చించుకుంటున్నారు.

ఆర్అండ్‌బీ ఏఈ ఏమన్నారంటే...

సిమెంటు రోడ్లు, మురుగు కాల్వలకు సంబంధించి బిల్లులు మంజూరయ్యాయి. రోడ్లు, మురుగుకాల్వల నిర్మాణ పనులు త్వరలోనే మొదలు పెడతామని కాంట్రాక్టర్ చెప్పారు. వినాయక చవితి పండుగ తర్వాత పనులు ప్రారంభిస్తామని ఆయన తెలిపారు. ఆ ప్రయత్నంలోనే ఉన్నాం. త్వరలోనే రోడ్లు బాగుపడతాయి.

- వెంకటరమణ, ఏఈ, రోడ్లు భవనాల శాఖ వేంపల్లె

బిల్లులు మంజూరు

వేంపల్లెలో సీసీ రోడ్డు, మురుగుకాల్వల నిర్మాణాలు అర్థాంతరంగా నిలిపివేశారు. ప్రధానంగా బిల్లులు రాని కారణం ఒకటైతే ఎన్నికలు రావడం, టీడీపీ ప్రభుత్వం ఏర్పాటు కావడంతో ఇంకా పనులు మొదలు కాలేదు. పులివెందుల నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవి, ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. సీఎం దృష్టికి తీసుకెళ్లి పెండింగ్ బిల్లులు మంజూరు చేయించి పనులు మొదలు పెట్టిస్తామని బీటెక్ రవి తెలిపారు. ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి సీఎంను కలిసి సీసీ రోడ్డు పనులు నిలిచిపోవడం వలన ప్రజలు పడుతున్న ఇబ్బందులను వివరించారు. దీంతో గత ప్రభుత్వం పెట్టుకున్న రూ.7కోట్ల బిల్లును 20 రోజుల క్రితం మంజూరు చేశారు. ఇక సెప్టెంబరు 1వ తేదీ నుంచే పనులు ప్రారంభమవుతాయని ప్రచారం సాగింది. కానీ 20రోజులు గడుస్తున్న పనులు మాత్రం ప్రారంభం కాలేదు. దీంతో టీడీపీ ప్రభుత్వ హయాంలో బిల్లులు మంజూరైనా పనుల ప్రారంభంలో జాప్యం ఎందుకు జరుగుతుందో అర్థంకాని పరిస్థితి నెలకొంది. ఇక్కడి అధికార పార్టీ ప్రధాన నాయకులు జోక్యం చేసుకొని వెంటనే పనులు ప్రారంభమయ్యేలా చూడాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

పారిశుధ్యంపై అవగాహన

వల్లూరు, సెప్టెంబరు 13 : మండల పరిధిలోని బాకరాపురం గ్రామంలో శుక్రవారం స్థానిక సచివాలయ అధికారులు పారిశుధ్యం ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా స్థానిక రామాలయం వద్ద సమావేశం ఏర్పాటు ఏసి గ్రామంలో ఎక్కడా మురుగునీరు లేకుండా ఉండేట్లు చూసుకోవలసిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ప్రతి ఒక్కరూ తడి పొడి చెత్తలను వేర్వేరుగా చేసి చెత్తబుట్టల్లో వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి హరీష్‌కుమార్, రియాజ్ అహ్మద్, టీడీపీ నాయకుడు నాగసుబ్బారెడ్డి అవగాహన కల్పించారు.

మద్యం, నాటుసారా ధ్వంసం

చక్రాయపేట, సెప్టెంబరు 13: మండల పరిధిలో పలుకేసుల్లో పట్టుబడ్డ మద్యం బాటిల్లు, నాటుసారాను ధ్వంసం చేశారు. శుక్రవారం చక్రాయపేట పోలీస్‌స్టేషన్ వద్ద ఎక్సైజ్ శాఖ, పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మద్యం బాటిల్లు, బీరు బాటిల్లలో ఉన్న మందును పారబోశారు. నాటుసారాను పారబోశారు. ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాసులు, ఎస్ఐ రంగారావు ఇతర అధికారుల ఆధ్వర్యంలో ఈ మద్యంను, నాటుసారాను ధ్వంసం చేశారు.

విద్యుత్ సరఫరా నిలిపివేత

చెన్నూరు, సెప్టెంబరు 13 : చెన్నూరు, వల్లూరు మండలాల సబ్‌స్టేషన్ల పరిధిలో 33 కేవీ లైన్ల మార్పు, మరమ్మతుల కారణంగా ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ రామలింగారెడ్డి తెలిపారు. కావున విద్యుత్ వినియోగదారులందరూ ఉదయం 8 గంటల్లోపు విద్యుత్‌తో తమ అవసరాలు తీర్చుకోవాలని కోరారు.

వ్యత్యాసాలుంటే చర్యలు తప్పవు



సమావేశంలో మాట్లాడుతున్న ఏఓ ఓబులేసు

పెండ్లిమర్రి, సెప్టెంబరు 13: ఎరువులు, విత్తనాలు, పురుగులమందుల డీలరు తప్పకుండా స్టాక్ రిజిస్టర్, బిల్ బుక్ వేయాలని మండల వ్యవసాయాధికారి ఓబులేసు తెలిపారు. ఏమైన వ్యత్యాసాలు ఉంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. శుక్రవారం ఏఓ కార్యాలయంలో డీలర్లకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పాటించాల్సిన నిబంధనలపై చర్చించారు. అనంతరం డీలర్ల సంఘం అధ్యక్షుడిగా భరత్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా పంగా చంద్రశేఖర్, సెక్రటరీగా జగన్‌మోహన్‌రెడ్డి, కోశాధికారిగా వెంకటరెడ్డి, సంయుక్త కార్యదర్శిగా నాగసుబ్బారెడ్డి ఏకగ్రీంగా ఎన్నికయ్యారు.

ప్రతి ఒక్కరూ బీజేపీ సభ్యత్వం తీసుకోండి

కడప (మారుతీనగర్), సెప్టెంబరు 13: ప్రపంచ దేశాలలో మన దేశాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చెందేలా చేయాలనే ఏకైక లక్ష్యంతో ప్రధాని నరేంద్ర మోదీ తలపెట్టిన వికసిత్ భారత్‌లో సభ్యత్వం తీసుకోవాలని పార్టీ నాయకులు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక వై.జంక్షన్‌లో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. బీజేపీ కడప పార్లమెంట్ కన్వీనర్ బొమ్మన సుబ్బరాయుడు,జిల్లా అధ్యక్షుడు వెంకటసుబ్బారెడ్డి, రాష్ట్ర నాయకుడు లక్ష్మీనారాయణరెడ్డి బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు బొమ్మన విజయ్ హాజరై సెల్‌ఫోన్ ద్వారా సభ్యత్వ నమోదు చేయించారు.

శిక్షణానంతరం కూడా సత్ప్రవర్తనతో మెలగాలి

● రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ గజ్జల వెంకటలక్ష్మి

కడప (క్రైం), సెప్టెంబరు 13 : శిక్షణ కాలం ముగిసిన తరువాత కూడా సత్ప్రవర్తనతో మెలగాలని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ గజ్జల వెంకటలక్ష్మి ఖైదీలనుద్దేశించి అన్నారు. శుక్రవారం రాష్ట్రీయ పోషణ్ కార్యక్రమం సందర్భంగా ఆమె కడప మహిళా సబ్ జైలును సందర్శించి మాట్లాడారు. ఈ సందర్భంగా గజ్జల వెంకటలక్ష్మి మాట్లాడుతూ క్షణికావేశంతో తప్పులు చేసి ప్రస్తుతం ఖైదీలుగా ఉన్నారన్నారు. శిక్షణ కాలం పూర్తయిన తరువాత సత్ప్రవర్తనతో మెలగాలన్నారు. మహిళాఖైదీలను పరామర్శించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సబ్‌జైలునందు హెల్త్‌క్యాంపులను ప్రారంభించి మొక్కలు నాటారు. అనంతరం స్థానిక ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్‌కు చేరుకుని ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో సాయంత్రం 4.30 నుంచి 6 వరకు జిల్లాకు సంబంధించిన స్థానిక బాధిత మహిళల కోసం నిర్వహించిన గ్రీవెన్స్ ద్వారా లైంగిక వేధింపులు, వరకట్న వేధింపులు, సైబర్ నేరాలు, గృహహింస, అపహరణ, వెట్టిచాకిరికి గురైన బాధిత మహిళల ఫిర్యాదులు స్వీకరించారు. జిల్లా స్త్రీ, శిశుసంక్షేమ సాధికారత అధికారిణి శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

ఉపాధి హామీ సమస్యలపై జిల్లా వ్యాప్త ఉద్యమాలు

కడప (సెవెన్‌రోడ్స్), సెప్టెంబరు 13 : ఉపాధి హామీ సమస్యలపై జిల్లా వ్యాప్త ఉద్యమాలు చేపట్టనున్నట్లు ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్, రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకట్రావు, సీపీఐ కడప జిల్లా కార్యదర్శి గాలిచంద్ర డిమాండ్ చేశారు. శుక్రవారం సీపీఐ కార్యాలయంలోని హోచిమన్‌భవన్‌లో నిర్వహించిన వ్యవసాయ కార్మిక సంఘం కడప జిల్లా జనరల్ బాడీ సమావేశంలో మాట్లాడారు.

అశ్వవాహనంపై శ్రీరంగనాధస్వామి

నేడు శ్రీరంగనాథ స్వామి కల్యాణోత్సవం



అశ్వవాహనంపై శ్రీరంగనాధస్వామి

పులివెందుల టౌన్, సెప్టెంబరు 13 :పులివెందులలో శ్రీరంగనాథస్వామి నూలు పూజ ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం శ్రీరంగనాథస్వామి, శ్రీదేవి భూదేవి అమ్మవార్లు అశ్వవాహనంపై కొలువై భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు సోమేపల్లి క్రిష్ణరాజ్యశర్మ,అర్చకులు శశిధర్, రాజసింహాల పర్యవేక్షణలో ఈ కార్యక్రమాలు జరిగాయి. ఆలయ ఈఓ వెంకటరమణ పర్యవేక్షణలో స్వామివారికి ప్రత్యేక అలంకరణ కార్యక్రమాలు, ఇతర పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చల్లా వంశీయులు పాల్గొన్నారు.

అన్నదానం పుణ్యకార్యం : ఎమ్మెల్యే



అన్నదానంలో ఎమ్మెల్యే మాధవి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి

కడప (ఎడ్యుకేషన్), సెప్టెంబరు 13 : అన్నదానం పుణ్యకార్యమని ఎమ్మెల్యే మాధవి అన్నారు. కడప నగరం 12వ డివిజన్ ఫక్కీరుపల్లె యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాధుని ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం అన్నదాన చేశారు. ఈ కార్యక్రమాన్ని కడప ఎమ్మెల్యే మాధవి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఫక్కీరుపల్లెలో వినాయక ఉత్సవాల్లో భాగంగా డివిజను నాయకుడు మజ్జారి జయరాం అన్నప్రసాద వితరణ చేశారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీప రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులు గోవర్ధనరెడ్డి, హరిప్రసాద్, నాయకులు జయరాం, ఫక్కీరుపల్లె గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి

సీకేదిన్నె, సెప్టెంబరు 13: రైతులు తెగుళ్ల యాజమాన్య పద్ధతులు చేపట్టడం ద్వారా పంట అధిక దిగుబడి సాధించవచ్చనివ్యవసాయ పరిశోధన స్థానం అధిపతి శ్రీనివాసాచారి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి నాగేశ్వరరావు తెలిపారు. గ్రామీణ యువతకు ప్రధాన పంటల్లో పురుగులు, తెగుళ్ల యాజమాన్యంపై జరిగిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రైతులు వారి పంటలను దక్కించుకునేందుకు శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులు సూచించిన విధంగా యాజమాన్య పద్ధతులు పాటించి దిగుబడులు పెంచుకోవచ్చని అదే విధంగా పంట సాగుకు అయ్యే ఖర్చులు తగ్గించుకోవచ్చన్నారు. పురుగులు, తెగుళ్ల యాజమాన్యం, కలుపు మందుల వాడకం, నీటి యాజమాన్యం, వివిధ పంటల్లో విత్తనోత్పత్తి, జీవన ఎరువులు, వర్మీకంపోస్టు వాడకం గురించి వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ పరిశోధన స్థానం అధిపతి శ్రీనివాసాచారి, ఆత్మా పీడీ విజయలక్ష్మి, శాస్త్రవేత్తలు మాధురి, కేవీకే ఏరువాక కేంద్రం సమన్వయకర్తలు వీరయ్య, అంకయ్యకుమార్, ప్రభాకర్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

కోతి కరిచి చిన్నారికి గాయాలు



కోతి దాడిలో గాయపడ్డ బాలిక

చెన్నూరు, సెప్టెంబరు 13 :మండలంలోని చిన్నమాచుపల్లెలో ఇంటి వద్ద ఆడుకుంటున్న నందిని అనే మూడేళ్లబాలికను శుక్రవారం కోతి కరవడంతో తీవ్ర గాయాలపాలైంది. ఇంటి వద్ద ఆడుకున్న బాలిక వద్ద పెద్దలు ఎవరూ లేకపోవడంతో బాలికపై కోతి దాడి చేసింది. ఈ సంఘటనతో భయపడ్డ బాలిక తండ్రి విశ్వనాథరెడ్డి చిన్నారిని హుటాహుటిన కడప ఆసుపత్రికి తరలించారు. చేతితో పాటు శరీరంపై పలుచోట్ల గాయాలయ్యాయని, సుమారు పదివేలు వైద్యానికి ఖర్చయిందన్నారు. అలాగే కుక్కల బెడద కూడా ఎక్కువైందని, కార్పొరేషన్ పరిధిలోని గ్రామాల్లో అధికారులు స్పందించి కోతులు, కుక్కల బెడద నుంచి తప్పించాలని కోరారు.

ప్రతి ఒక్కరూ పోషకాహారాన్ని తీసుకోవాలి



పోషకాహారంపై అవగాహనకల్పిస్తున్న దృశ్యం

వేముల, సెప్టెంబరు 13: ప్రతి ఒక్కరూ పోషకాహారాన్ని తీసుకోవాలని అంగన్వాడీ సూపర్‌వైజర్ తెలిపారు. స్థానిక వెంకటేశ్వరపురం అంగన్వాడీ కేంద్రం లో పోషకాహార మాసోత్సవాన్ని నిర్వహించారు. గర్భవతులు, బాలింతలు, తల్లులు, కిశోర బాలికలకుపలు సూచనలు, సలహాలు ఇచ్చారు.

రక్తహీనత వలన కలిగే నారోగ్యం గురించి తెలిపారు. ప్రతి రోజు చిరుధాన్యాలు, పప్పు ధాన్యాలు, తాజా ఆకుకూరలు, కాయగూరలు, పండ్లు, బెల్లం, నువ్వులు తీసుకోవాలని తెలిపారు. ఐరన్ మాత్రలు, నులిపురుగుల నివారణ మాత్రలు కూడా తీసుకోవాలని తెలిపారు. ఏమాత్రం నిర్లక్ష్యం చేసినా ఆరోగ్య సమస్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు, సహాయకురాలు, ఏఎన్ఎం, ఆశకార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వరంగ సంస్థల ఆప్తమిత్రుడు సీతారాం ఏచూరి

కడప (సెవెన్‌రోడ్స్), సెప్టెంబరు 13 : భారత కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ప్రభుత్వరంగ సంస్థల పరిరక్షణ ఉద్యమానికి అందించిన మద్దతు, సహకారం అమూల్యమైనదని, ఎల్ఐసీ ఉద్యోగుల సంఘం డివిజన్ ప్రధాన కార్యదర్శి రఘునాథరెడ్డి పేర్కొన్నారు. స్థానిక యూనియన్ కార్యాలయం ఆవరణంలో డివిజన్ అధ్యక్షుడు అవధానం శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన సంతాప సభలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు అక్బర్‌బాషా, చంద్రపాల్, అమీనా పర్వీన్, వసుప్రద, కేసీఎస్‌రాజు, అయ్యవార్‌రెడ్డి, రఘు, అప్పయ్య, చిన్నయ్య, మహేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో ఉన్నత శిఖరాలను అధిరోహించాలి : ఎస్ఐ



విదార్థులకు సూచనలు ఇస్తున్న ఎస్ఐ తులసీ నాగప్రసాద్

సింహాద్రిపురం, సెప్టెంబరు 13: విద్యార్థులు క్రమశిక్షణతోనే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని సింహాద్రిపురం ఎస్ఐ తులసీనాగప్రసాద్ సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని కోవరంగుట్టపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రస్తుత ఆధునిక టెక్నాలజీ వినియోగంపై సమాజంలో బాలబాలికలు ఎలా మెలగాలి అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎస్ఐ విద్యార్థులకు సూచనలు ఇస్తూ ఆధునిక టెక్నాలజీని ప్రతి విద్యార్థి మంచి పనికి వినియోగం చేసుకోవాలన్నారు. ఆన్‌లైన్ గేమ్స్ జోలికి వెళ్లి ఇబ్బందుల పాలు కావద్దన్నారు. సెల్ ను అనవసర విషయాలకు అధిక సమయం వినియోగంచవద్దన్నారు. అపరిచిత వ్యక్తుల పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. విద్యార్థులు ఈవిటీజింగ్ జోలికి వెళ్లవద్దన్నారు. విద్యార్థినుల పట్ల ఎవరైనా అసభ్యకరంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు. విద్యార్థినులకు ఇబ్బంది కలిగితే 100కు ఫోన్ చేసి పోలీసుల సాయం పొందవచ్చన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం రవణమ్మ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ వినియోగదారులు మొబైల్ లింక్ చేసుకోవాలి

వేంపల్లె, సెప్టెంబరు 13: వేంపల్లెలోని సాయిరజిత హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీలో గ్యాస్ కనెక్షన్ ఉన్న ప్రతి ఒక్కరు మొబైల్ ఫోన్ లింక్ చేసుకోవాలని నిర్వాహకుడు, జడ్పీటీసీ సభ్యుడు రవికుమార్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఒకపై మొబైల్ ఫోన్‌కు ఓటీపీ వస్తుందని అప్పుడే గ్యాస్ డెలివరీ అవుతుందన్నారు. గతంలో మొబైల్ ఫోన్ లింక్ ఉంటే కొత్తగా నమోదు చేసుకోవాల్సిన అవసరం లేదని, ఫోన్ నెంబర్లు మార్చిన వారు కొత్తగా తీసుకొని ఫోన్ నెంబర్ లింక్ లేనివారు డెలివరీబాయ్ వద్దగాని, ఆన్‌లైన్‌లో గాని, గ్యాస్ ఏజెన్సీ కార్యాలయంలో గాని ఫోన్ నెంబర్లు లింక్ చేసుకోవచ్చన్నారు. డొమెస్టిక్ సిలిండర్లను వాణిజ్యపరంగా ఉపయోగించవద్దని ఆయన వినియోగదారులకు తెలిపారు. మొబైల్‌ఫోన్ లింక్ ఉంటేనే ఇక నుంచి గ్యాస్ సరఫరా ఉంటుందనే విష యం వినియోగదారులు గుర్తుపెట్టుకొని నెంబర్‌ను లింక్ చేసుకోవాలని ఈ సందర్భంగా ఆయన విజ్ఞప్తి చేశారు.

ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

వేంపల్లె, సెప్టెంబరు 13: ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ శ్రద్ధ వహించాలని ముఖ్యంగా పిల్లల్లో ఉండే నులిపురుగుల నివారణకు ప్రణాళికాబద్ధంగా మందులు ఇవ్వాలని తహసీల్దార్ హరినాథ్‌రెడ్డి, ఎంపీడీఓ దివిజ సంపతి తెలిపారు. నులివపురుగుల నివారణకు తహసీల్దార్ కార్యాలయంలో వైద్యఆరోగ్య శాఖ సిబ్బంది ఆధ్వర్యంలో తహసీల్దార్, ఎంపీడీఓలు వాల్‌పోస్టర్లు విడుదల చేశారు. విద్యార్థులందరికి నులిపురుగు నివారణ మాత్రలను అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సభ్యులు జీవిరమణ, పోతిరెడ్డి శివ, భానుకిరణ్ తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు స్టాఫ్ నర్సులను క్రమబద్ధీకరించాలని వినతి



తులసిరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న కాంట్రాక్టు స్టాఫ్ నర్సులు

వేంపల్లె, సెప్టెంబరు 13: కొన్నేళ్లగా కాంట్రాక్టు పద్ధతిలో పని చేస్తున్న స్టాఫ్‌నర్సులను ప్రభుత్వం క్రమబద్ధీకరించేందుకు చర్యలు తీసుకునేలా సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని రాజ్యసభ్య మాజీ సభ్యుడు తులసిరెడ్డికి కాంట్రాక్టు స్టాఫ్ నర్సులు వినతిపత్రం సమర్పించారు. వేంపల్లెలో శుక్రవారం ఆయనను కలిసి వినతిపత్రం సమర్పించారు. 115 జీఓను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని ఈ సందర్భంగా తులసిరెడ్డి వారికి హామీ ఇచ్చారు.

డిజిటల్ అక్షరాస్యతపై ప్రతి అవగాహన కలిగి ఉండాలి

● మహిళా డిగ్రీకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సలీంబాషా



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సలీంబాషా


కడప (ఎడ్యుకేషన్), సెప్టెంబరు 13 :ప్రతి విద్యార్థీ డిజిటల్ అక్షరాస్యతపై అవగాహన కలిగి ఉండాలని ప్రిన్సిపాల్ డాక్టర్ సలీం బాషా తెలిపారు. శుక్రవారం కోటిరెడ్డి మహిళా డిగ్రీ కళాశాలలో డిజిటల్ అక్షరాస్యతపై సర్టిఫికెట్ కోర్సులు ప్రారంభించారు. ఈ సందర్భంగా అర్థశాస్త్ర విభాగాధిపతి విజయలక్ష్మీదేవి మాట్లాడు తూ తమ కళాశాలలో విద్యార్థులకు డిజిటల్‌పై అవగాహన కల్పించాలన్నారు. ప్రస్తుతం మనం డిజిటల్ లిటరసీ యుగంలో జీవిస్తున్నామన్నారు. నేషనల్ స్కిల్ డెవలప్‌మెంటు ట్రైనింగ్ సెంటరు హెడ్ ఎస్‌కే అంజుమ్ మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో విద్యార్థులు డిజిటల్ పరిజ్ఞానం కలిగి ఉండాలని, భవిష్యత్తులో ఉపాధి అవకాశాలు పొందాలంటే విద్యతో పాటు డిజిటల్ పరిజ్ఞానం తప్పనిసరి అన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు శ్రీనివాసులరెడ్డి, ఎం.గురుమోహన్‌రెడ్డి, సీవీ సుబ్బారెడ్డి, నాగవేణి, రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

'లైబ్రరీలో తొలగించిన ఫోటోలను యధావిధిగా పెట్టాలి'

కడప (ఎడ్యుకేషన్), సెప్టెంబరు 13 : సీపీ బ్రౌన్ భాషాపరిశోధన కేంద్రంలో ఫోటో రాజకీయాలు చేయవద్దని సీపీ బ్రౌన్ గ్రంధాలయం సలహా మండలి సభ్యుడు జానమద్ది విజయభాస్కర్ తెలిపారు. లైబ్రరీలో తొలగించిన ఫోటోలు యదావిధిగా పెట్టాలని కోరారు. శుక్రవారం ఆయన వైవీయూ వైస్ చాన్సలర్, రిజిస్ట్రార్లకు లేఖ రాశారు. సీపీ బ్రౌన్ గ్రంధాలయ పరువు ప్రతిష్ఠలను మంటగల్పవద్దన్నారు. అలాంటి వారిని ప్రోత్సహించవద్దని చెప్పారు. ఫోటోలు తొలగించిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. లైబ్రరీలో తొలగించిన వారి ఫోటోలు తిరిగి యదాస్థానంలో పెట్టాలని కోరారు. అలాగే అన్నిఫోటోలు ఒకే సైజ్‌లో ఉండేలా చూడాలని కోరారు.

1989 డీఎస్సీ వారికి పదోన్నతుల్లో అవకాశాలు కల్పించాలి

● డీఈఓకు ఎస్టీయూ వినతి



డీఈఓకు వినతిపత్రం అందిస్తున్న ఎస్టీయూ ప్రతినిధులు

కడప (ఎడ్యుకేషన్), సెప్టెంబరు 13 :పదోన్నతుల్లో 1989 డీఎస్సీ వారికి అవకాశాలు కల్పించాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఇలియాస్ బాషా, అసోసియేట్ రాష్ట్ర అధ్యక్షుడు సురేశ్‌బాబు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాలగంగిరెడ్డి కోరారు. ఈ మేరకు శుక్రవారం డీఈఓకు వినతిపత్రం అందించారు. పదవీ విరమణ వయసు దగ్గరపడుతున్నందున సోషల్ సబ్జెక్టుల్లో పదోన్నతి కల్పించాలన్నారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండండి


కమలాపురం రూరల్, సెప్టెంబరు 13:మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండి జీవిత ఆశయాలను సాధించాలని ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి సూచించారు. శుక్రవారం ఉమ్మడి కడప జిల్లా స్వచ్ఛంద సంస్థ సమన్వయంతో మదర్‌థెరిసా సేవా సమితి చారిటుబల్ ట్రస్టు ఆధ్వర్యంలో కమలాపురం స్వామి వివేకానంద ఇంగ్లీషు మీడియం విద్యార్థులకు గంజాయి, మత్తు మాదకద్రవ్యాలపై అవగాహన కార్యక్రమం కరస్పాండెంట్ రామసుబ్బారెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. కమలాపురం ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి, రిటైర్డ్ జిల్లా ఎడ్యుకేషనల్ ఆఫీసరు డాక్టర్ గుణశేఖర్, ట్రస్టు చైర్మన్ జూటూరు విజయ్‌కుమార్ పాల్గొని మాట్లాడారు. యువత ఎక్కువగా మాదకద్రవ్యాలకు అలవాటుపడుతున్నారని, దాని వల్ల సమాజంలో అసాంఘిక కార్యకలాపాలు పెరుగుతున్నాయన్నారు. దీంతో తగాదాలు పెరుగుతాయన్నారు. కావున విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని తెలిపారు.

దోమల నియంత్రణ అందరి బాధ్యత

పులివెందుల రూరల్, సెప్టెంబరు 13: దోమల నియంత్రణ అందరి బాధ్యత అని బాకరాపురం అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ వైద్యాధికారి డాక్టర్ శాంతకుమార్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని బాకరాపురం, జండామాను వీధిలోఫ్రైడే-డ్రైడే కార్యక్రమం నిర్వహించి అవగాహన కల్పించారు. ఇంటింటా సర్వే నిర్వహించి లార్వా ఉన్న చోట అబేట్ పిచికారీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ శాంతకుమార్ మాట్లాడుతూ దోమ కాటు వలన మలేరియా, డెంగ్యూ, చికున్ గునియా, మెదడువాపు వ్యాధి,ఫైలేరియా వంటి వ్యాధులు వస్తాయని, కావున దోమలు వృద్ధిచెందకుండా ఉండాలంటే ఫ్రైడే-డ్రైడే నిర్వహించాలన్నారు.

'గాలేరు - నగరి' ద్వారా పాపాఘ్నికి కృష్ణాజలాలు

నీరు విడుదల చేసిన టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి, ఎమ్మెల్యే కృష్ణచైతన్యరెడ్డి



కాల్వ పనులను పరిశీలిస్తున్న పుత్తా నరసింహారెడ్డి, ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి

వీరపునాయునిపల్లె,సెప్టెంబరు 13: గాలేరు- నగరి సుజల స్రవంతిలో భాగంగా గాలేరు-నగరి కాల్వ ద్వారా కృష్ణాజలాలను పాపాఘ్నికి తీసుకువస్తామని దీనితో నాలుగు మండలాలకు సాగునీరు, తాగునీరు అందుతుందని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి, కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యకుమార్‌రెడ్డిలు అన్నారు. శుక్రవారం మండల టీడీపీ కన్వీనర్ విజయభాస్కర్‌రెడ్డి, బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి గండి ఓబయ్యయాదవ్ ఆధ్వర్యంలో కాల్వ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా అడవిచెర్లోపల్లె సమీపంలోని గ్యాలరీ నగరి కాల్వ, పసిడిపల్లె గ్రామ సమీపంలోని వంతా కాల్వ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ కాల్వ ద్వారా నీరు తీసుకు రావడంతో నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాల్లోని ప్రజలకు తాగునీరు, సాగునీరు పుష్కలంగా అందుతుందన్నారు. సీఎం చంద్రబాబు, ఇరిగేషన్ శాఖా మంత్రి కమలాపురం నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయాలనే సంకల్పంతో ఉన్నారన్నారు. మరో నాలుగు రోజుల్లో ఈ వంక ద్వారా కృష్ణాజలాలను విడుదల చేసి పాపాఘ్నికి అందిస్తామన్నారు. మండల టీడీపీ కన్వీనర్ విజయభాస్కర్‌రెడ్డి, మండల టీడీపీ రైతు సంఘం అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, అడిచెర్లోపల్లె గంగిరెడ్డి, శేఖర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ శివ, పాయసంపల్లె మాజీ సర్పంచు వెంకటరమణారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, తలపనూరు సర్పంచు శివమారుతిరెడ్డి, వీఎన్‌పల్లె అరుణ్‌కుమార్‌రెడ్డి, బుసిరెడ్డిపల్లె గంగారాం ప్రసాద్‌రెడ్డి, ఓబుల్‌రెడ్డిపల్లె మాజీ సర్పంచు గోపాల్‌యాదవ్, ఎస్ఆర్‌పేట జనార్దన్‌రెడ్డి, మిట్టపల్లె ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అడ్డూ అదుపులేని మట్టి మాఫియా

● గుట్టలు, వంకలు, వాగులు తవ్వేస్తూ యథేచ్ఛగా తరలింపు ● రోజూ 1200 ట్రాక్టర్లకు పై మాటే ● చోద్యం చూస్తున్న అధికారులు

బద్వేలు, సెప్టెంబరు 13: మట్టికి ఉన్న డిమాండ్‌ను ఆసరాగా చేసుకుని కొంతమంది బరితెగింపుగా వ్యవహరిస్తున్నారు. వైసీపీ పాలనలో యథేచ్ఛగా మట్టి అక్రమాలు జరిగినట్లే ఇప్పుడూ సాగుతోంది. వారికి అడ్డూ, అదుపు ఉండదు. వారిని అడిగేవారు ఉండరు. దీంతో వారి అక్రమ మార్గానికి లైన్ క్లియర్‌గా మారింది. ఇదే అదునుగా మట్టి మాఫియా అడ్డంగా తోలేస్తున్నారు. గ్రావెల్ (మట్టి)కు ఉన్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని అక్రమ మార్గంలో సంపాదించేందుకు మట్టి మాఫియా ఇష్టారాజ్యంగా వంకలు, వాగులు చెరువులను తవ్వేస్తూ రోజూ వేల టన్నుల మట్టిని అక్రమంగా తరలిస్తున్నారు. రోజూ ఆయా ప్రాంతాలలో పగలు, రాత్రి అనే తేడా లేకుండా అక్రమ మట్టి తవ్వకాల తరలింపు జాతరను తలపిస్తోంది. ఇంతజరుగుతున్నా అధికారులు చోద్యం చూస్తుండడంతో వారి ఇష్టారాజ్యమైంది. బద్వేలు పట్టణం రోజు రోజుకు విస్తరిస్తున్న తరుణంలో నిర్మాణాలకు, అక్రమ లే అవుట్లకు అవసరమైన మట్టికి బాగా గిరాకీ ఉంది. మట్టి తవ్వేందుకు అనుమతులు ఉండి తరలిస్తే పర్వాలేదు. కానీ రోజూ బద్వేలు, గోపవరం ప్రాంతాలలో మట్టి మాఫియా యథేచ్ఛగా అక్రమంగా రోజుకు 200 టన్నుల మట్టిని తరలిస్తోంది. అక్రమ మట్టి తవ్వకాలకు కళ్లెం పడకపోతే ఆ ప్రాంతంలో చెరువులు, వంకలు, స్వరూపాలే పూర్తిగా మారిపోయే దుస్థితి ఏర్పడింది. ఇదే జరిగితే వర్షపునీరు, చెరువులో చేరే పరిస్థితిగాని, కొద్దో, గొప్పో చెరువులో ఆ నీరు బయటకు వచ్చే పరిస్థితిగాని ఉండదు.





భాకరాపేట చెరువు నుంచి మట్టి తరలిస్తున్న దృశ్యం, రాత్రివేళలో ట్రాక్టర్ ద్వారా అక్రమంగా మట్టిని తరలిస్తున్న వైనం

ఇవేకాదు కొందరు గుట్టలనే తవ్వేస్తున్నారు. బద్వేలు ప్రాంతంలో రెవెన్యూ, ఇరిగేషన్, పోలీసు అధికారులు మట్టి అక్రమ తవ్వకాల తరలింపుపై దృష్టిపెట్టక పోతే మాఫియా మరింత రెచ్చిపోయే దుస్థితి కనిపిస్తోంది.

రోజుకు 1200 ట్రాక్టర్ల మట్టి తరలింపు..: బద్వేలు, గోపవరం ప్రాంతాల నుంచి రోజుకు దాదాపు 1200 ట్రాక్టర్ల ద్వారా అక్రమంగా మట్టిని తరలిస్తూ లక్షలాది రూపాయలను సంపాదించడమే ధ్యేయంగా పెట్టుకున్నారు. బాకరా పేట చెరువు, శంకరాపురం, సగిలేరు , ప్రభుత్వ భూముల నుంచి అక్రమంగా మట్టిని తరలిస్తున్నారు. కొత్తగా ఇంటినిర్మాణాలకు, అక్రమ లే అవుట్లకు మట్టిని తరలిస్తున్నారు. పగలు, రాత్రి అనే తేడాలేకుండా తవ్వకాలు జరిపి ట్రాక్టర్లు, టిప్పర్లతో తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఏది ఏమైనా అక్రమ మట్టికి అడ్డుకట్ట వేయకపోతే చెరువులు,కుంటలు రూపురేఖలు మారే అవకాశం ఉందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అక్రమంగా మట్టి తలిస్తే చర్యలు తప్పవు..

ఎవరైనా అక్రమంగా చెరువులు, కుంటల నుంచి మట్టిని తరలిస్తే చర్యలు తప్పవు. అనుమతులు తీసుకుని మట్టిని తరలించాలి. అనుమతులు లేకుండా అక్రమంగా మట్టిని తరలిస్తే ట్రాక్టర్లను సీజ్ చేసి కేసులు నమోదు చేయడం జరుగుతుంది

ఉదయభాస్కర్‌రాజు, తహసీల్దారు , బద్వేలు

పెన్నాకు కొనసాగుతున్న నీటి విడుదల

మైలవరం, సెప్టెంబరు 13 : మైలవరం జలాశయం నుంచి పెన్నానదికి 2 వేల క్యూసెక్కుల నీటిని వదులుతున్నట్లు మైలవరం జలాశయ ఏఈఈ గౌతమ్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. గండికోట జలాశయం నుంచి 2,500 క్యూసెక్కుల నీరు వచ్చి మైలవరానికి చేరుతుండటంతో పెన్నాకు 2 వేలు, ఉత్తరకాలువకు 80 క్యూసెక్కులు, దక్షిణకాలువకు 90 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. మైలవరం జలాశయ పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 6.5 టీఎంసీలు కాగా ప్రస్తుతం మైలవరంలో 4.5 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గండికోట నుంచి మైలవరానికి ఇన్‌ఫ్లో పెరిగితే పెన్నానదికి నీటి విడుదల పెంచుతామని పెన్నా పరీవాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు తెలిపారు.

మద్యంతాగి వాహనం నడిపిన వారికి జైలుశిక్ష

పోరుమామిళ్ల, సెప్టెంబరు 13 : మద్యం తాగి వాహనం నడిపిన ఇద్దరికి బద్వేలు జడ్జి గాయత్రి మూడురోజులు జైలుశిక్ష విధించినట్లు ఎస్‌ఐ కొండారెడ్డి తెలిపారు. మండలంలోని కొత్తవెంకటాపురానికి చెందిన మనోహర్, కలసపాడు మండలం శంకవరానికి చెందిన బాల గుర్విరెడ్డి మద్యం తాగి వాహనాలు నడుపుతుండగా వారిని పరీక్షలు నిర్వహించి మద్యం తాగినట్లు గుర్తించి కేసు నమోదు చేశామన్నారు. కాగా శుక్రవారం వారికి జైలుశిక్ష విధించారని తెలిపారు.

50 మద్యం సీసాలు పట్టివేత

రాజుపాలెం, సెప్టెంబరు 13 : మండల పరిధిలోని పగిడాల గ్రామానికి చెందిన బత్తల శ్రీనివాస్ అనే వ్యక్తి వద్ద నుంచి శుక్రవారం 50 మద్యం బాటళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ కత్తి వెంకటరమణ తెలిపారు. మద్యం అమ్ముతున్నట్లు సమాచారం రావడంతో అతన్ని పట్టుకుని మద్యం స్వాధీనం కేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

92 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత

రాజుపాలెం, సెప్టెంబరు 13: దువ్వూరు, పెద్దజొన్నవరానికి చెందిన దస్తగిరయ్య, పుల్లయ్య అనే వ్యక్తుల వద్ద నుంచి 92 బస్తాల బియ్యం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ కత్తి వెంకటరమణ తెలిపారు. గ్రామాల్లో తిరుగుతూ రేషన్ బియ్యం తక్కువ రేటుకు కొని ఎక్కువ రేటుకు అమ్ముకోవడానికి వెలవలి గ్రామం నుంచి ప్రొద్దుటూరుకు పోవుతుండగా వెలివలి గ్రామంలోని సాయిబాబా దేవాలయం వద్ద వీరిద్దరినీ అరెస్టు చేసి వ్యాను, రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. 4420 కేజీల బియ్యం పట్టుకున్నట్లు తెలిపారు. వ్యాను సీజ్ చేసినట్లు తెలిపారు.

జూదరుల అరెస్టు

జమ్మలమడుగు, సెప్టెంబరు 13: జమ్మలమడుగు పట్టణంలోని కాపువీధిలో గురువారం రాత్రి ఏడుగురు జూదరులను అరెస్టు చేసినట్లు సమాచారం. వారి వద్ద నుంచి రూ.33,500 స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. కాగా శుక్రవారం రాత్రి సీఐ లింగప్పను జూదరుల అరెస్టుకు సంబంధించి వివరాలు అడుగగా ఆయన చెప్పకుండా దాటవేశారు. జమ్మలమడుగు పట్టణం, గ్రామాల్లో మట్కా, పేకాట జోరుగా సాగుతున్నట్లు సమాచారం.

వీఆర్వో మృతి

కొండాపురం, సెప్టెంబరు 13:మండలంలోని సంకేపల్లె వీఆర్వో గా పనిచేస్తున్న పుల్లయ్య(45) గుండెపోటుతో మృతి చెందాడు. కొంత కాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన గురువారం గుండెపోటు రావడంతో మృతి చెందినట్లు రెవెన్యూ సిబ్బంది తెలిపారు. కాగా ఆయన మండలంలోని తాళ్లప్రొద్దుటూరు లో నివాసం ఉంటున్నారు. ఆయనకు భార్యతో పాటు పిల్లలు ఉన్నారు. ఆయన మృతదేహాన్ని కొండాపురం తహసీల్దార్ మాధవకృష్ణారెడ్డితో పాటు తోటి సిబ్బంది సందర్శించి శుక్రవారం నివాళులర్పించారు.

రోడ్డు ప్రమాదంలో ట్రాన్స్‌కో ఏడీఈకి గాయాలు

ప్రొద్దుటూరు , సెప్టెంబరు 13 : ప్రొద్దుటూరు పట్టణం దొరసానిపల్లె బైపాస్ రోడ్డులో బైక్ పై వెళుతున్న ట్రాన్స్‌కో ఏడీఈ గురుమూర్తిని ట్రాక్టర్ ఢీకొన్న ప్రమాదంలో తీవ్ర గాయాలయ్యాయి. శుక్రవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో మోటారు సైకిల్‌పై ఎర్రగుంట్ల నుంచి రాచమల్లు కాలనీలోని తన ఇంటికి వస్తుండగా రైల్వే స్టేషన్ క్రాస్ రోడ్డు సమీపంలో ఈ ప్రమాదం జరిగింది. ఈ సంఘటనలో గురుమూర్తి తలకు గాయమైంది. కుడి కాలు విరిగింది. దీంతో అతనిని గాంధీరోడ్డులోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. సంఘటన స్థలాన్ని రూరల్ ఎస్‌ఐ పరిశీలించారు.ప్రమాద ఘటనపై ఆరా తీశారు.

అద్దె చెల్లించండి

బ్రహ్మంగారిమఠం, సెప్టెంబరు 13 : బ్రహ్మంగారిమఠం మండల కేంద్రంలోని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ డీఆర్‌డీఏ వెలుగు పథకానికి సంబంధించిన మార్కెటింగ్ గదుల అద్దె ఆరు సంవత్సరాల నుంచి చెల్లించకపోవడంతో శుక్రవారం జిల్లా అధికారులు డీపీయం ఐబీ హరప్రసాద్‌రాజు, రెడ్డయ్య, నరసింహులు, అద్దె చెల్లించని వారి వద్దకు వెళ్లి పదిరోజుల్లో అద్దె చెల్లించాలన్నారు. బకాయిలు దాదాపుగా రూ.3.50లక్షలు ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మండల సమాఖ్య ప్రతినిధులు, గ్రామ సంఘం ప్రతినిధులు, కమ్యూనిటీ కోఆర్డినేటర్లు, గ్రామ సంఘం అసిస్టెంట్లు పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రాల తనిఖీ



అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కేంద్ర బృందం

బద్వేలు, సెప్టెంబరు 13: బద్వేలు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని రామ్ నగర్, బోయిన పల్లె, ఐత్రంపేట అంగన్వాడీకేంద్రాలను శుక్ర వారం కేంద్ర బృందం సందర్శించింది. ఈ సందర్భంగా అంగన్వాడీ కేంద్రంలోని పోషణ, గర్భిణులు, బాలింతలు,పిల్లలకు పోషణ అందించే వాటిపై ఆరా తీశారు. ఎరువులతో పండించే ఆకు కూరలు, కూరగాయలతో రక్తహీనతను నివారించవచ్చని వారు సూచించారు. పోషకాహారంతో పిల్లలు ఆరోగ్యంగా ఎదుగుతారన్నారు. అంగన్వాడీలకు వచ్చే గర్భిణులు, బాలింతలకు పోషకాహారంతో పాటు సలహాలు , సూచనలు ఇవ్వాలని కేంద్ర కమిటీ బృందం వారు సూచించారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో శ్రీదేవి, ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వైద్య సిబ్బంది నిర్లక్ష్యం వీడాలి

● రాష్ట్ర మాలమహానాడు అధ్యక్షుడు డిమాండ్

జమ్మలమడుగు, సెప్టెంబరు 13: ఇటీవల అన్ని ప్రాంతాల్లో విషజ్వరాలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వైద్య సిబ్బంది నిర్లక్ష్యం వీడాలని రాష్ట్ర మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు రామాజి ఇమ్మానుయేల్ తెలిపారు. శుక్రవారం జమ్మలమడుగు మండలం మోరగుడి గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద సంబంధిత మెడికల్ సిబ్బంది, సూపర్‌వైజర్లతో ఆయన మాట్లాడి వారు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ గ్రామాల్లో వైరల్ జ్వరాలు వస్తున్నా సిబ్బంది పట్టించుకోకపోవడం దారుణమన్నారు. జిల్లా అధికార యంత్రాంగం వెంటనే చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మాలమహానాడు రాయలసీమ అధ్యక్షుడు మేకల ఓబులేసు, తదితరులు పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభా వంతులకు వెంకట్ స్ఫూర్తి



వెంకట్‌ను అభినందిస్తున్న కలెక్టర్ శివశంకర్ లోతేటి

ప్రొద్దుటూరు టౌన్, సెప్టెంబరు 13: విభిన్న ప్రతిభావంతులకు కామిశెట్టి వెంకట్ స్ఫూర్తిదాయకమని కలెక్టర్ శివశంకర్‌లోతేటి పేర్కొన్నారు. శుక్రవారం శ్రీదేవి ఫంక్షన్ హాలులో వెంకట్ ఫౌండేషన్ మూడో వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ వెంకట్ తన తల్లిదండ్రుల కృషితో ప్రతిభా పాటవాలు ప్రదర్శించి ఎందరో ప్రముఖుల నుంచి అనేక అవార్డులు, రివార్డులు అందుకోవడం అభినందనీయమన్నారు. గండికోటలో నిర్వహించే పర్యాటక దినోత్సవంలో కామిశెట్టి వెంకట్ ప్రదర్శనకు అవకాశం కల్పిస్తామని తెలిపారు. భవిత కేంద్రాల్లో వెంకట్ తల్లి విశాలాక్షితో శిక్షణ ఇప్పించడానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి మాట్లాడుతూ కామిశెట్టి వెంకట్ ప్రతిభ వెనుక తల్లిదండ్రుల కృషి మరువలేనిదని పేర్కొన్నారు. కార్యక్రమంలో కామిశెట్టి వెంకట్ తల్లిదండ్రులు రాధాకృష్ణ, విశాలాక్షి, ఆర్డీవో శ్రీనివాసులు, మాజీ ఎంపీపీ రాఘవరెడ్డి, భవిత కేంద్రాల్లోని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

పోరుమామిళ్ల, సెప్టెంబరు 13 : ఉద్యోగ, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలు వెంటనే పరిష్కరించాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మాదన విజయకుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం సాయంత్రం పోరుమామిళ్లలోని ప్రభుత్వ ఉన్నతపాఠశాలలో యూటీఎఫ్ ప్రాంతీయ మండల సమావేశం జరిగింది. అనంతరం సీపీఎం నేత సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో చెన్నయ్య, మాజీ జిల్లా కార్యదర్శులు జయరామయ్య, జోజయ్య, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఈశ్వర్‌రాజు, శ్రీనివాసులు, శోభన్‌కుమార్, చెన్నక్రిష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ నిర్మూలనపై అవగాహన సదస్సు

పోరుమామిళ్ల, సెప్టెంబరు 13 : మండలంలోని ఈదుళ్లపల్లెలో చైల్డ్ ఫర్ ఇండియా లింక్ వర్కర్స్‌స్కీం వారి ఆధ్వర్యంలో మీకు తెలుసా అనే అవగాహన కార్యక్రమం నిర్వహించారు. శుక్రవారం ఈదుళ్లపల్లెలో జరిగిన కార్యక్రమంలో యువత వారి జీవన నైపుణ్యాలను వివరిచంఆరు. ఈ కార్యక్రమంలో చైల్డ్ ఫర్ ఇండియాలింక్‌వర్క్ స్కీం ఖాదర్‌బాషా, పోలయ్య, పుల్లయ్య, సుజాత, దుర్గాదేవి, మహిళా సభ్యులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

పోరుమామిళ్ల, సెప్టెంబరు 13 : ఏపీ రాష్ట్ర విశ్రాంత ఉద్యోగుల సర్వసభ్య సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు.శుక్రవారం పెన్షనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పది సంవత్సరాలుగా పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడుగా సేవలందించిన చాగలగొండు గురుమూర్తిని సన్మానించారు. నూతన అధ్యక్షుడుగా పాలకొలన నారాయణరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా మద్దిమామయ్య, కోశాధికారిగా దస్తగిరిసాహెబ్, ఉపాధ్యక్షులు విజయభాస్కర్‌రెడ్డి, చెముడూరు వీరస్వామి, ఉప కార్యదర్శిగా వెంకటక్రిష్ణయ్య, సహాయ కోశాధికారిగా మహేశ్వర్‌రెడ్డి, గౌరవాధ్యక్షులు దేశాయి మార్కారెడ్డి, సలహాదారుడిగా సి.గురుమూర్తి వ్యవహరిస్తారన్నారు.

రుణాలు సద్వినియోగం చేసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న వరప్రసాదరాజు

బ్రహ్మంగారిమఠం, సెప్టెంబరు 13 : రుణాలు సద్వినియోగం చేసుకోవాలని వెలుగు పథకం మైదుకూరు ఏరియా కోఆర్డినేటరు వర ప్రసాదరావు తెలిపారు. శుక్రవారం మండల సమాఖ్య కార్యాలయంలో వార్షిక మహాసభ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ ప్రభుత్వం అందించే పథకాలను డ్వాక్రా సంఘ మహిళలు సద్విని యోగం చేసుకోవాలన్నారు. అనంతరం కార్యవర్గ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా శోభారాణి, కార్యదర్శి చైత న్య, కోశాధికారి నర్మద, గ్రామసంఘం కార్యవర్గం సభ్యులు నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌పీవో టీపీఎం రెడ్డయ్య మండల సమాఖ్య ఏపీయం ప్రకాశరావు, సీసీలు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పవిత్రోత్సవాలు

జమ్మలమడుగు, సెప్టెంబరు 13: జమ్మలమడుగు నారాపురం వేంకటేశ్వరస్వామి ఆలయంలో పవిత్రోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రెండో రోజు భక్తులు పూజలు చేశారు. శుక్రవారం ఉదయాన్నే పవిత్రోత్సవ కార్యక్రమాల్లో భాగంగా అగ్ని, పవిత్ర ప్రతిష్ఠ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఆలయంలో శ్రీదేవి, భూదేవి సమేత నారాపురం వేంకటేశ్వరస్వామివారికి భక్తులు పూజలు చేసి మొక్కుకున్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

బద్వేలు/గోపవరం, సెప్టెంబరు 13: నియోజకవర్గ పరిధిలోని పాయలకుంట్ల ఫీడర్‌లో 33/11కేవి సబ్‌స్టేషన్ బద్వేలు, గోపవరం మండలాల పరిధిలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటలవరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కులాయప్ప, ఏఈలు రమణయ్య, చిన్నయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విద్యుత్ అంతరాయానికి ప్రజలు సహకరించాలని కోరారు.

న్యాయం చేయండి

బద్వేలుటౌన్, సెప్టెంబరు 13 : చెన్నంపల్లె రెవెన్యూపరిధిలోని సర్వేనెంబర్ 1769/2లో తమ స్వాధీనంలో ఉన్న స్థలంలో వైసీపీనాయకులు కబ్జాచేశారని న్యాయం చేయాలంటూ తహసీల్దార్ కార్యాలయం ఎదుట శుక్రవారం నారాయణమ్మ అనే మహిళ తన బంధువులతో కలసి నిరసన చేపట్టారు. అనంతరం తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేసి న్యాయం చేయాలని కోరారు.

వ్యసనాలతో జీవితం నాశనం చేసుకోవద్దు

మైదుకూరు రూరల్ ,సెప్టెంబరు 13 : మత్తు పదార్థాలకు బానిసలైన ప్రతి ఒక్కరూ సమాజంలో గౌరవం,గుర్తింపును కోల్పోతారని మైదుకూరు ఎస్‌ఐ మద్దిలేటి తెలిపారు. పలు స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో జరుగుతున్న మాదకద్రవ్యాల నిర్మూలన పక్షోత్సవాలలో భాగంగా శుక్రవారం స్థానిక జూనియర్ కళాశాలలో విద్యార్థులతో సమావేశం జరిగింది.ఈ సమావేశంలో మద్దిలేటి మాట్లాడుతూ సిగరెట్,మద్యం, గంజాయి,డగ్స్ లాంటి పదార్థాలకు బానిసలై యువత జీవితాలను నాశనం చేసుకుంటోందని ఆవేదన వ్యక్తం చేశారు. చెడు అలవాట్లు,వ్యసనాలతో జీవితాల నాశనం చేసుకోవద్దు అని విద్యార్థులకు సూచించారు.

రికార్డులు సక్రమంగా ఉండాలి

ఖాజీపేట, సెప్టెంబరు 13: వైద్య సిబ్బంది రికార్డులు సక్రమంగా ఉండేలా చూడాలని జోనల్ మలేరియా అధికారి డాక్టర్ లక్ష్మణ్‌నాయక్ అన్నారు. శుక్రవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ల్యాబ్, పరిసర ప్రాంతాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జోనల్ ఆరోగ్య విస్తరణాధికారి నిత్యపూజయ్య, మండల ఆరోగ్య విస్తరణాధికారి నాగభూషణం, వైద్యాధికారి ముబీన్, సూపర్‌వైజర్ శోభన్‌బాబు, క్రిష్ణప్రియ, ఆశా నోడల్ ఆఫీసర్ అరుణకుమారి, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వరదబాధితుల కోసం లక్ష విరాళం

ఎమ్మెల్యే వరదకు చెక్కు అందజేత



లక్ష రూపాయల చెక్కును అందజేస్తున్న తొగట కల్యాణమండపం నేతలు

ప్రొద్దుటూరు, సెప్టెంబరు 13 : విజయవాడ వరదబాధితుల కోసం లక్ష రూపాయల విరాళాన్ని తొగట వీర కల్యాణ మండపం కమిటీ ప్రకటించింది. ఆమేరకు శుక్రవారం టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే వరదరాజులరెడ్డికి లక్ష రూపాయల చెక్కును వారు అందజేవారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వరదబాధితుల కోసం తమ వంతు సహాయంగా లక్షరూపాయలు ప్రభుత్వానికి అందజేయాలని చెక్కును ఎమ్మెల్యేకు అందజేశామన్నారు. కార్యక్రమంలో తొగట వీర సంఘం నేతలు పల్లా శేషయ్య, పట్టుపోగుల పుల్లయ్య, బండారు రఘురామయ్య, బండారుసూర్యనారాయణ, మాజీ కౌన్సిలర్ అంజి పాల్గొన్నారు.

నిత్యావసర వస్తువులు, చీరలు పంపిణీ

ప్రొద్దుటూరు టౌన్, సెప్టెంబరు 13: విజయవాడ వరదబాధితులకు నిత్యావసర వస్తువులు, చీరలు పంపిణీ చేసినట్లు మన ప్రజాసేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఆయూబ్‌ఖాన్ తెలిపారు. శుక్రవారం విజయవాడలోని సింగ్ నగర్, పైపుల వీధిలో వరద బాధితులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మన ప్రజా సేవా సమితి ప్రధాన కార్యదర్శి హరియాదవ్, ఉపాధ్యక్షుడు నరసింహ, యూసఫ్, సహాయ కార్యదర్శి ఫరాన్, రఫి, సైరాబాను, మెహబూబా తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు అందజేత

ప్రొద్దుటూరు , సెప్టెంబరు 13 : విజయవాడలోని వరదబాధితులకోసం ప్రొద్దుటూరు బీసీ ప్రజా చైతన్య సమాఖ్య ఆధ్వర్యంలో సేకరించిన విరాళాలు నిత్యావసర సామగ్రిని శుక్రవారం అందజేశారు. గురువారం రాత్రి విజయవాడకు లారీల్లో సాగ్రిని తరలించి అక్కడ బాధితులకు నేరుగా పంపిణీ చేసినట్లు ఆ సంస్థ అధ్యక్షుడు బొర్రా రామాంజనేయులు తెలిపారు. బాధితులకు జరిగి నష్టం అపారమైనదని ప్రతి ఒక్కరూ చేతనైనంత సహాయం అందించి ఆదుకోవాలని పిలుపునాచ్చారు.

సైబర్ సెక్యూరిటీరంగంలో ఉద్యోగ అవకాశాలు

ప్రొద్దుటూరు టౌన్, సెప్టెంబరు 13: సైబర్ సెక్యూరిటీ రంగంలో ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని, ఎస్ఆర్ఐటీ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ పాండురంగన్‌రవి తెలిపారు. శుక్రవారం కళాశాలలో సైబర్ సెక్యూరిటీపై ఉచిత శిక్షణ తరగతుల ముగింపు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సైబర్ సెక్యూరిటీ రంగంలో నైపుణ్యం సాధించాలని సూచించారు. ఐసీటీ సెక్యూరిటీ ఇన్‌స్ట్రక్టర్ ఉమైర్‌అహ్మద్‌ఖాన్ మాట్లాడుతూ సైబర్ సెక్యూరిటీ రంగంలో శిక్షణ పూర్తి చేసుకున్నవారిలో 75 శాతం మంది విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ బసిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు వీరకుమార్‌రెడ్డి, కరస్పాండెంట్ వీరకల్యాణ్‌రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

సీతారాం ఏచూరికి ఘన నివాళులు



బద్వేలులో సీతారాం ఏచూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

జమ్మలమడుగు, సెప్టెంబరు 13: జమ్మలమడుగు పాత బస్టాండు సమీపాన మున్సిపల్ మస్టర్‌పాయింట్ ఆవరణలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ , ఏఐటీయూసీ, సీపీఐ స్థానిక కార్యదర్శి ప్రసాద్ శుక్రవారం సీతారాం ఏచూరి మరణం పీడిత ప్రజలకు తీరని లోటని తెలిపారు. ముందుగా సీతారాం ఏచూరి చిత్రపటానికి వారు నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు ప్రతాప్, గంగాధర్, యాకోబు, ప్రభావతి, వినోద్, దాసు, జయపాల్, రాజేష్,నాగేంద్ర, హరి తదితరులు పాల్గొన్నారు.

జమ్మలమడుగు..: జమ్మలమడుగు పట్టణంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద శుక్రవారం రాత్రి డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్ తదితరులు కామ్రేడ్ సీతారాం ఏచూరికి కొవ్వొత్తులతో నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ పట్టణ కార్యదర్శి తులసీశ్వర్‌యాదవ్, విశ్రాంత ఉపాధ్యాయుడు వై.చంద్రశేఖర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, జిలాన్, కాంతయ్య తదితరులు పాల్గొన్నారు.

మైలవరం..: సీపీఎం జాతీయ నాయకుడు సీతారాం ఏచూరికి ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం ఆధ్వర్యంలో మైలవరంలో ఘన నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు శివ నారాయణ, నాయకులు కొండయ్య, సంజీవ పాల్గొన్నారు.

బద్వేలు..: సీతారాం ఏచూరి మరణం సీపీఎంకు పూడ్చలేని లోటని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ పేర్కొన్నారు. శుక్రవారం బద్వేలులోని సుందరయ్య భవనంలో ఆపార్టీ కమిటీ ఆధ్వర్యంలో ఏచూరి చిత్రపటానికి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు రామ్మోహన్, పట్టణ నాయకులు శ్రీను, ముడియం చిన్ని, శివకుమార్, ఎస్‌కే.ఆదివల్, మోక్షమ్మ, ఖైరున్ బీ, బాలమ్మ, రామలక్షుమ్మ, ఫాతిమా,చాందిని, చంద్రకళ, మాధవి, అరుణ, ఖాదర్‌బీ, సాదియా, బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

పోరుమామిళ్ల..: సీపీఎం నేత సీతారాం ఏచూరికి సీపీఎం, సీఐటీయూ, ఐద్వా నాయకులు నివాళులర్పించారు. శుక్రవారం పోరుమామిళ్లలోని అంబేడ్కర్ భవనంలో సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాలులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యులు గౌసియాబేగం, సీఐటీయూ, నాయకులు బొజ్జ చిన్నయ్య, జాకోబ్ పాల్గొన్నారు.

కలసపాడు..: కామ్రేడ్ సీతారాం ఏచూరి మరణం పార్టీకి తీరని లోటు అని కలసపాడు మండల సమితి నాయకులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. శుక్రవారం కామ్రేడ్ సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కేవీపీ జిల్లా కమిటీ సభ్యులు ప్రవీణ్‌కుమార్, సీపీఐ మండల సెక్రటరీ గడిమెట్ సునీల్ కుమార్, నారాయణ, వ్యవసాయ కార్మిక సంఘం సుదర్శన్, సుబ్బరాయుడు, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.